ట్రాఫిక్ జాం...'జరిమానాలే' వారీ డ్యూటీలు!

- ఉదయం, సాయంత్రం వేళల్లో ఎక్కడికక్కడ వాహనాల రద్దీ
- ఉన్నా...లేనట్లుగానే పోలీసుల వ్యవహారాలు
- అరగంట, గంటకు పైగా రాకపోకల ఆలస్యం
- ట్రాఫిక్ క్లియర్‌కు శ్రద్ధ చూపడంలేదనే విమర్శలు

చలాన్ విధిస్తున్న ట్రాఫిక్ పోలీస్

నగరంలో ట్రాఫిక్‌జాం (ఫైల్‌ఫోటో)

హైదరాబాద్, మే21, ప్రభాతవార్త: నగరంలో ట్రాఫిక్‌జాం అంతా ఇంతా కాదు...సిటీ సెంటర్‌లో రాకపోకలు సాగించాలంటే సాహసం చేయాల్సిందే... ఒక్క వాహనదారుడు ట్రాఫిక్ రూల్స్ పాటించకపోయిన ఒకదాని తర్వాత మరొకటి వాహనాలు ఆగుతూ కిలోమీటర్ల మేరకు ట్రాఫిక్‌జాం.. ఆయా స్నిగల్స్ వద్ద బూత్‌ల్లో సిబ్బంది ఉన్న పట్టింపే ఉండదు. వాహనదారులే గొడవలుపడి సర్దుకపోయి వెళ్లాల్సిందే..కేవలం డ్రైవింగ్ లైసన్స్, ఆర్సీలతో పాటు మరీ ముఖ్యంగా హెల్మెట్ ధరించడంపై దృష్టిసారించి హమ్మయ్యా..విధులు ముగించామనే ధోరణిలో పోలీసులు ఉంటున్నారు. దీంతో ట్రాఫిక్ వ్యవస్థపైన నమ్మకం కోల్పోతోంది. రోడ్లపై వాహనాల రద్దీ, అక్రమపార్కింగ్‌ల సమస్యలను పరిష్కరించడంతో పాటు రూల్స్‌బ్రేక్ చేసేవారిపై జరిమానాలు విధించాలి. అంతేకానీ అదే పరమావధిగా దృష్టిసారించొద్దని వాహనదారుల నుంచి అభిప్రాయలు వ్యక్తమవుతున్నాయి. ఇక అర్ధరాత్రివేళ్లలో పోకీరీల వేగాన్ని నియంత్రించేందుకు పెట్రోలింగ్ సైతం పకడ్బందిగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ట్రాఫిక్‌జాంతో సమస్యలు....

ఉదయం, సాయంత్రం వేళల్లో సెంటర్ సిటికి లక్షలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కార్లు, బైక్‌లు, ఆటోలు, ఆర్టీసీ బస్సులతో పాటు ట్రావెల్ బస్సులతో రోడ్లన్ని కిక్కిరిసిపోతాయి. కేపీహెచ్‌బీ, సికింద్రాబాద్, అఫ్జల్‌గంజ్, ఉప్పల్, తార్నాక, రాజేంద్రనగర్, కోఠి, ఎల్బీనగర్, చంపాపేట, సంతోష్‌నగర్, చాంద్రాయణగుట్ట, మలక్‌పేటతో పాటు జాతీయ రహదారుల్లో ప్రయాణాలు జరుగుతుంటున్నాయి. ఉద్యోగులు, వ్యాపారస్తులతోనే బైక్‌లు, కార్లు అధికంగా ఉన్నాయి. అర్ధరాత్రి దాటక భారీవాహనాలను అనుమతించడంతో వేగంగా నడపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా ట్రాఫిక్ బూత్‌లో ఇద్దరు ముగ్గురు కానిస్టేబుల్స్ ఉన్నా సిగ్నల్స్ ఆపరేటర్ చేసేందుకే సిబ్బంది అని అనిపించకమానదు. రూల్స్ పాటించని వాహనాలను పట్టించుకోరు. వేగాలను నియంత్రించరు. రోడ్లపై అక్రమ పార్కింగ్ సైతం చూడకుండా కేవలం ఫోటోలు తీసి చలాన్‌లు మాత్రం విధిస్తుంటారు. దీంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్‌జాం, అరగంట, గంటకు పైగా వేచి ఉండడం, అక్కడక్కడ వాహనదారులు గొడవపడడంతో రాకపోకలకు మరింత ఆలస్యం జరుగుతుందనే పలువురు వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. పోలీసులు వెంటనే స్పందిస్తే ఇలాంటి సమస్యలే తలెత్తకుండా ఉండడంతో పాటు టైం కూడా మిగులుతుందని పేర్కొంటున్నారు. ఏ సమస్యలు లేకుండా సాఫీగా సాగుతూ బూత్‌లో ఉన్న ఇబ్బంది ఉండదని, ఏమైన రద్దీ ఉంటే చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు. అదేవిధంగా రోడ్లపై అక్రమంగా పార్కింగ్ చేసిన పట్టించుకోరనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. మియాపూర్,చందానగర్, ఈసీఐఎల్, పాతబస్తీ, ఎల్‌బీనగర్, కొంపల్లి, తదితర ప్రధానమార్గాల్లో రోడ్ల మధ్యవరకు అక్రమంగా పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్‌జాంకు కారణాలు. వీటిపై కూడా పోలీసులు చర్యలు తీసుకపోవడంపై అంతర్యం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొందరు పోలీస్ సిబ్బంది ఆయా యజమానులతో కుమ్మకై వెసులుబాటు కల్పిస్తున్నారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. నెలవారీగా ఆమ్యామ్యాలు తీసుకోవడంతోనే చర్యలు తీసుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటితో అధిక జాం ఏర్పడుతుందని చెబుతున్నారు. పెద్ద సంఖ్యలో వాహనాలకు చిన్నపాటి ఇరుకిరుకు దారులతో రాకపోకలు ఎలా సాగించేది అని మండిపడుతున్నారు.

హెల్మెట్, జరిమానాలేనా?

వాహనదారుడు రోడ్డెక్కితే జరిమానాలే పరమవధిగా కొందరు పోలీసులు విధులు నిర్వర్తిస్తున్నారు. హెల్మెట్, డ్రైవింగ్ లైసన్స్, ఆర్సీ, చలాన్‌లపైనే ఆరా తీస్తున్నారు. తప్పించుకునేందుకు ప్రయత్నిస్తే నలుగురైదుగురు పోలీసులు వెంటపడి ఆపి వాహనాలను సీజ్ చేయడం, ఫోటోలు దింపి జరిమానాలు ఇంటి చిరునామాలకు పంపిస్తూ విధులు ముగిస్తున్నారు. కూడళ్ల ముందు నిత్యం ఇలాంటి కలాపాలు సాగించడంతో ట్రాఫిక్ సమస్యను కొలిక్కి వచ్చేనా అనుమానాలు అందరిలో రేకెత్తిస్తున్నాయి. ఏదో అప్పుడప్పుడు జరిమానాలు విధించాలని, నిరంతరం అదే ధ్యాసలో ఉంటే ఎలా అని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. వీరి నిర్లక్ష్యం, అలసత్వంతోనే సమస్య మరింత తీవ్రతరంగా మారుతుందని చెబుతున్నారు. రోడ్లపైన ట్రాఫిక్ పోలీసులు ఉన్నారంటే కేవలం ఫైన్‌ల కోసమే అని ప్రతి వాహనదారుడికి అర్థమవుతోంది. ట్రిపుల్ రైడింగ్, రూల్స్ బ్రేక్, రాంగ్‌రూట్ వాహనదారులను ఆపి పోలీసులు వాహనపత్రాలు అడగడం, సీజ్ చేస్తామని బెదిరించడం వంటి చేయడంతో ఎంతోకొంత చేతితడిపి తప్పించుకుంటున్నారు. మరికొందరు ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారు. పోలీసులను చూసి బైక్‌ను తీసుకుంటారనే భయంతో అడ్డదారిలో వేగాన్ని పెంచి పరుగులుపెడుతున్నారు. ఇలాంటి నిత్యం ఆయా ప్రధానమార్గాల్లో నిత్యం కనిపిస్తూన్నే ఉంటున్నాయి. దీనికే ట్రాఫిక్ సమస్యలను పట్టించుకోకుండా అతిక్రమణలపై కొందరు పోలీసులు దృష్టిసారించి రోజువారిగా వేల రూపాయాలు అక్రమార్జనతో సంపాదిస్తున్నారు. దీంతో పోలీస్ వ్యవస్థకే మాయని మచ్చని మిగులుస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టిసారించి విధులపై పకబ్బంది చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

నగరంలో వర్షం..

- పలుప్రాంతాల్లో రోడ్లన్నీ జలమయం
- భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్న వాతావరణశాఖ
- అప్రమత్తమైన జిహెచ్ఎంసి

హైదరాబాద్,మే 21,ప్రభాతవార్త: ద్రోణి, ఉపరితల ఆవర్తన ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాజధాని నగరం హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో బుధవారం మధ్యాహ్నం నుంచి ఈదురు గాలులు, పిడుగులతో కూడిన వానలు పడ్డాయి.ఈ క్రమంలో ప్రభుత్వం రెయిన్ అలర్ట్ జారీ చేసింది. ఉపరితల ద్రోణి ఉదయం నుంచి హైదరాబాద్ సికింద్రాబాద్ జంట నగరాలపై మేఘాలు కమ్ముకోగా.. మధ్యాహ్నం నుంచి పలుచోట్ల ఈదురు గాలులతో వర్షం కురుస్తోంది. కొన్ని చోట్ల చిరుజల్లులు, మరికొన్ని చోట్ల ఓ మోస్తరు వాన పడుతోంది. మలక్ పేట్, నాంపల్లి, చార్మినార్, దిల్సుఖ్ నగర్, కోఠి, రామంతపూర్, అబిడ్స్, అంబర్పేట్.. తది తర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఖైరతాబాద్, లక్డీకాపూల్, రాజ్ భవన్, ట్యాంక్ బండ్ సమీపంలో స్వల్ప వర్షంతో మొదలై.. జడి వానగా మారింది. నగర శివారు ప్రాంతాల్లో చోట్ల చిరు జల్లులు రాత్రి వరకు పడుతూనే ఉన్నాయి. రాత్రి సమయంలో హైదరాబాద్లో తీవ్రమైన తుఫాను వచ్చే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ అప్రమత్తం అయ్యింది. సాయంత్రం పనులు ముగించుకుని వెళ్లేవాళ్లను అప్రమత్తం చేసింది. మ్యాన్ హోల్స్, కరెంట్ పోల్స్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని నగర ప్రజలకు సూచించింది.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

-జిల్లా ఇంటర్మీడియట్ అధికారి దాసరి ఒడ్డెన్న

హైదరాబాద్,మే 21,ప్రభాతవార్త: జిల్లాలో ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి దాసరి ఒడ్డెన్న తెలిపారు. ఈమేరకు బుధవారం పరీక్షల నిర్వహణలో పాల్గొనే సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బందితో జిల్లా ఇంటర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..జిల్లాలో మొత్తం 119 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 43061, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 31996, మొత్తం 75,057 విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని పేర్కొన్నారు. ప్రశ్నా పత్రాలను 29 పోలీస్ స్టేషన్లో భద్రపరిచామని, వాటిని 33 కస్టోడియన్లు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో జవాబు పత్రాలను పంపించే సమయంలో పాలిథిన్ కవర్లలో ఉంచి వాటిని సంబంధిత డిఆర్డిసి కేంద్రాలకు పంపించాలని సూచించారు. పరీక్షల్లో ఇంటర్ బోర్డ్ నియమ నిబంధనలు తూచా తప్పకుండా పాటించేలా పర్యవేక్షణ చేయాలని పలు సూచనలు చేశారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఆన్లైన్లో హాల్ టికెట్ డౌన్లోడ్ చేసుకోవాలని, సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్ సప్లమెంటరీ పరీక్షల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో సమావేశమైన దాసరి ఒడ్డెన్న

తిరుమలహిల్స్ పార్కుకు కబ్జా చెర నుంచి విముక్తి

- నోటీసులు ఇవ్వకుండా ఎలా కులుస్తారని అధికారులతో వాగ్వాదం
- తమ లేఔట్‌కు హెచ్ఎండిఎ అనుమతి ఉందన్న బాధితులు

నార్సింగి, మే 21 ప్రభాతవార్త : మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని తిరుమలహిల్స్ కాలనీ పార్కును హైడ్రా అధికారుల ఆదేశాల మేరకు మణికొండ మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు కబ్జా చెర నుంచి విడిపించారు. బుధవారం ఉదయం నార్సింగి పోలీసుల బందోబస్తు మధ్య రెండు జేసీబీల సహాయంతో 6.వేల గజాల పార్కు స్థలం చుట్టూ వేసిన రేకుల ఫెన్సింగ్‌ను అధికారులు తొలగించారు. ఈ విషయం తెలుసుకున్న బాధితులు సంఘటనా స్థలానికి వచ్చి తమకు నోటీసులు ఇవ్వకుండా ఎలా మా ఫెన్సింగ్‌ను కులుస్తారని అధికారులతో వాగ్వాదం చేశారు. మా వద్ద ఉన్న డాక్యుమెంట్లతో కోర్టులో కేసు వేశామని, ఇప్పుడు ఇంకా కేసు నడుస్తుందని, ఈ స్థలం వద్దకు ఎవరూ రాకూడదని కోర్టు ఆదేశాలు ఉన్నా, తిరుమలహిల్స్ కాలనీ ప్రతినిధులు, అధికారులు కలిసి మాపై దౌర్జన్యం చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు రేకుల ఫెన్సింగ్‌ను తొలగించి అక్కడ ఈ స్థలం పార్కుదని, దీన్ని హైడ్రా కబ్జా నుంచి కాపాడిందని బోర్డును పెట్టారు.

మాది హెచ్ఎండిఏ లేఔట్ : బాధితులు

2008.లో సర్వే నెంబర్ 119/87పార్ట్‌లో చేసిన హెచ్ఎండిఏ లేఔట్‌లోని ప్లాట్లను మేము కొన్నామని బాధితులు సోయల్, అహ్మద్, అబుహనీఫా, బషీర్ ఉన్నీసా, మసూద్ మోయిజుద్దీన్ తదితరులు పేర్కొన్నారు. హైడ్రా, హెచ్ఎండిఏ, మణికొండ మున్సిపల్ అధికారులంతా ఏకపక్షంగా వ్యవహరించి రూపాయి రూపాయి కూడబెట్టుకొని ప్లాట్లు కొన్న మాకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ స్థలం వివాదంపై మేము కోర్టుకు వెళ్లామని, కోర్టులో కేసు నడుస్తుండగా, ఈ స్థలం వద్దకు ఎవరూ రాకూడదని కోర్టు ఆర్డర్ ఉందని చూపించినా అధికారులు వినకుండా లక్షల విలువ చేసే మా ఫెన్సింగ్‌ను తొలగించారని వాపోయారు. కోర్టు ఆర్డర్‌ను కూడా అధికారులు ఉల్లంఘించి, కోర్టు ధిక్కారణకు పాల్పడ్డారన్నారు. మా స్థలం కాకుంటే మా వద్ద నుంచి ఎల్ఆర్ఎస్ డబ్బులు ఎలా తీసుకున్నారని ప్రశ్నించారు. తిరుమల హిల్స్ కాలనీకి సంబంధించిన లేఔట్ ఇప్పటికీ లేదని, అంతా మేనేజ్ చేసుకుంటూ పబ్బం గడుపుకుంటున్నారన్నారు. హెచ్ఎండిఏ కార్యాలయంలో మేము ఆర్టీఏ యాక్ట్ కింద దరఖాస్తు చేసి తిరుమల హిల్స్ లేఔట్ ఇవ్వాలని అడిగితే అందుబాటులో లేదని సమాధానం ఇచ్చారన్నారు. మేము ఎవరి భూమిని కబ్జా చేయలేదని, డబ్బులు పెట్టి కొన్నామని, మా లేఔట్‌లో స్థలంను రోడ్లు, పార్కుకు రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చామన్నారు. తిరుమలహిల్స్ కాలనీ రోడ్లు, పార్కులు, కమ్యూనిటీ స్థలాలు ఎక్కడ రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చిందో చూయించాలని డిమాండ్ చేశారు. మేము తప్పు చేసి ఉంటే చట్ట ప్రకారం మమ్మల్ని జైలులో పెట్టాలని, ఇలా మా జీవితాంతం సంపాదించి కొన్న స్థలాన్ని మా నుంచి లాక్కొని మమ్ములను జీవచ్ఛవాలుగా మార్చడం దారుణమని పేర్కొన్నారు. మాకు న్యాయం జరిగేంత వరకు, మాకు అడ్డుపడే ప్రతీ ఒక్కరిపై చట్ట పరిధిలోనే పోరాటం చేస్తామని బాధితులు స్పష్టం చేశారు.

కమీషనర్ వివరణ :

తిరుమలహిల్స్ కాలనీ పార్కు స్థలం కబ్జాకు గురైందని, దాన్ని కబ్జా చెర నుంచి విడిపించాలని హైడ్రా అధికారులు ఇచ్చిన ఆదేశాల మేరకు బుధవారం పార్కు చుట్టూ ఉన్న ఫెన్సింగ్‌ను తొలగించామని మణికొండ కమీషనర్ ప్రదీప్ కుమార్ వివరించారు. నార్సింగి పోలీసుల సహకారంతో జేసీబీలను ఉపయోగించి రేకుల ఫెన్సింగ్‌ను తొలగించామన్నారు. స్థానికులు కొందరు ఈ స్థలం తమదని పేర్కొంటున్నారని, వారి వద్ద ఉన్న డాక్యుమెంట్లతో హైడ్రా అధికారులను సంప్రదించవచ్చని, కోర్టుకు వెళ్లి కేసులు వేసుకోవచ్చని కమీషనర్ ప్రదీప్ కుమార్ స్పష్టం చేశారు.

మణికొండ మున్సిపాలిటీ తిరుమలహిల్స్ పార్కు చుట్టూ వేసిన రేకుల ఫెన్సింగ్‌ను తొలగిస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు.

ప్రజావాణి ఫిర్యాదులపై హైడ్రా కమిషనర్ క్షేత్రస్థాయి పరిశీలన

-రంగనాథ్‌కు తమ గోడు వెళ్లబోసుకున్న ఫిర్యాదు దారులు

-అన్ని కోణాల్లో పరిశీలించిన న్యాయం చేస్తామని కమిషనర్ హామీ

హైదరాబాద్, మే 21, ప్రభాతవార్త: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నారు. శేరిలింగంపల్లి మండలం గోపన్నపల్లి విలేజ్ లోని రంగనాథ్ నగర్‌ను కమిషనర్ సందర్శించారు. రంగనాథనగర్ ప్లాట్ ఓనర్ల సంఘం యిచ్చిన ఫిర్యాదుపై వాకబు చేశారు. 1985 లో 184 ఎకరాల పరిధిలో 850కి పైగా ప్లాట్లతో లేఔట్ వేయగా తామంతా కొన్నామని 2021 కరోనా సమయంలో ప్రపంచమంతా ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని విలవిలలాడితే బడా రియల్ ఎస్టేట్ సంస్థల యజమానులు సమూహంగా ఏర్పడి మా లేఔట్ మొత్తాన్ని కబ్జా చేశారంటూ కమిషనర్ ముందు వాపోయారు. అప్పటికే కొంతమంది ఇళ్లను కట్టుకుని ఉండగా మమ్మల్ని తరిమేసి యిల్లను నేలమట్టం చేసి రహదారులు, పార్కులు కలిపేసి వ్యవసాయ భూమిగా మార్చేశారని వాపోయారు. ఆఖరకు అందులో ఉన్న దేవుడి గుడిని కూడా వదల్లేదని ఫిర్యాదు చేసారు. తాము కోర్టులను ఆశ్రయించగా వివాదం సుప్రీం కోర్టు వరకు వెళ్లిందని కోర్టు సూచనల మేరకు హై కోర్టు తమకు 4 వారాల్లో న్యాయం చేయాలని తీర్పు యిచ్చిందన్నారు. ఫిర్యాదు దారులు చెప్పినది విన్న కమిషనర్ వారం 10 రోజుల్లో ఇరుపక్షాలను పిలిపించి మాట్లాడుతానని ఆందోళన చెందవద్దని అన్ని కోణాల్లోనూ పరిశీలించి న్యాయం చేస్తామన్నారు. అంతకు ముందు మేడ్చల్ జిల్లా చెంగిచెర్ల, బోడుప్పల్ ప్రాంతాల్లో కమిషనర్ రంగనాథ్ పర్యటించారు. దేవాదాయ శాఖ ట్రస్ట్ భూములను ఆక్రమించి ఆ పక్కనే ఉన్న మా లేఔట్ ను కబ్జా చేయడానికి మాజీ ఎమ్మెల్యే ప్రయతిస్తున్నారని శ్రీమాత అరవింద కాలనీ వాసులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. సర్వే నెంబర్ 33/10లో మొత్తం 13 ఎకరాలు ఉండగా అందులో 7 ఎకరాలలో మాత అరవింద్ కాలనీ లేఔట్ దశాబ్దాల క్రితం 444 ప్లాట్లతో ఏర్పడిందన్నారు. తమ లేఔట్ పక్కనే మాజీ ఎమ్మెల్యేకు చెందిన స్థలం ఉండగా మా లేఔట్ దేవాదాయ శాఖ భూములంటూ కబ్జా చేయాలని ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. అదే ప్రాంతంలో బోడుప్పల్ విలేజ్‌లో లేఔట్లో వికాస్ వెల్ఫేర్ కాలనీ లో 70 ప్లాట్లు ఉండగా అందులో 35 ప్లాట్లు కలిగిన రాజకీయ నాయకుడు, గత ఎన్నికల్లో పోటీ చేసిన వ్యక్తి తమ ప్లాట్లు కూడా కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని ఆలేఔట్ లో రోడ్లు, పార్కులు లేకుండా చేశారంటూ స్థానికులు ఫిర్యాదు చేసారు. అలాగే శ్మశాన వాటికలున్న స్థలం తనదంటూ ప్లాట్లు వేసి విక్రయాలు చేపట్టారన్న ఫిర్యాదును పరిశీలించారు. గోపన్నపల్లిలో హౌసింగ్ బోర్డుకు కేటాయించిన దాదాపు 60 ఎకరాల భూమిలో ఫెన్సింగ్ వేయనియ్యడం లేదని స్థానిక అధికారులు ఫిర్యాదు చేయగా కమిషనర్ పరిశీలించారు.

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కమిషనర్ రంగనాథ్

పేదల ఆపద్భాంధవుడు రాజీవ్ గాంధీ

-రాజీవ్ గాంధీకి నేతల నివాళి

హైదరాబాద్ మే21,ప్రభాతవార్త : మాజీ ప్రధాని భారతరత్న రాజీవ్ గాంధీ 34వ వర్ధంతి సందర్భంగా మాజీ రాజ్యసభ సభ్యులు వి హనుమంతరావు ఆధ్వర్యంలో పంజాగుట్ట చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. మహనీయుడు రాజీవ్ గాంధికి పి సి సి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, పెద్దలు జానారెడ్డి , వి. హనుమంతరావు , మంత్రులు జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు దానం నాగేందర్ , బిర్లా ఐలయ్య రాజ్యసభ సభ్యులు ఏ అనిల్ కుమార్ యాదవ్, చైర్మన్లు శివసేనారెడ్డి ,సాయికుమార్‌లు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ...యువతకు 18 సంవత్సరాలకే ఓటు హక్కు మహిళలకు గ్రామపంచాయతీలలో రిజర్వేషన్ ఇప్పించిన ఘనత రాజీవ్ గాంధీ దే అని అన్నారు. ఈ సందర్భంగా వి హనుమంతరావు మాట్లాడుతూ, దేశంలో ఐటీ రంగానికి పునాదులు వేసిన మార్గదర్శి, నిరుపేదలకు అండగా నిలిచిన ఆపద్భాంధవుడు, మాజీ ప్రధాని భారతరత్న శ్రీరాజీవ్ గాంధీ గారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు విజయ రెడ్డి శ్రీలతశ్రీనివాస్ యాదవ్ మహాలక్ష్మి రామన్ గౌడ్ లక్ష్మణ్ యాదవ.బొల్లు కిషన్ జగదీశ్వర్ రావు . లఘు పతి యాదగిరి గౌడ్ అప్సర్ యూసుఫ్ ఆది అవినాష్ శంభుల శ్రీకాంత్ గౌడ్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీమ్స్ ఆస్పత్రి నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయండి

-కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ కార్యదర్శి డా. క్రిస్టీనా చొంగ్తు

హైదరాబాద్, మే 21,ప్రభాతవార్త: తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) సనత్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న ఆసుపత్రి నిర్మాణం పనులను వేగవంతం చేసేందుకు ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను త్వరితగతిన అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కుటుంబ-ఆరోగ్య సంక్షేమ శాఖ కార్యదర్శి డా. క్రిస్టీనా చొంగ్తు అన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు బుధవారం సీని యర్ అధికారులు టిమ్స్ నిర్మాణ స్థలాన్ని సందర్శించి, పురోగతిని సమీక్షించారు. ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి డా. క్రిస్టీనా చొంగ్తు, రోడ్స్ అండ్ బిల్డింగ్స్ శాఖ కార్యదర్శి హరిచందన దాసరి నేతృత్వం లో ఈ సందర్శన జరిగింది. నిమ్స్, కిమ్స్, యశోద, ఏఐజీ హాస్పిటల్స్ నుండి సీనియర్ వైద్య నిపుణులు, నిర్వాహకులు క్లినికల్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్లానింగ్‌కు సంబంధించి కీలక సూచనలు అందించారు. నిర్మాణ స్థలంలో సమగ్ర పరిశీలన అనంతరం, మిగిలిన పనులను వేగవంతం చేయడానికి, శాఖల మధ్య సమన్వయం పెంపొందించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూ పొందించినట్లు అధికారులు తెలిపారు. కార్డియాక్, కార్డియోథొరాసిక్ సర్జరీ, ఆర్గాన్ ట్రాన్స్ప్లాంటేషన్ సైన్సెస్‌లో టిమ్స్ సనత్‌నగర్‌ను అత్యాధునిక టెర్షియరీ కేర్ సంస్థగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజలకు ఉన్నత వైద్య సేవలు అందించేందుకు నిరంతరం పర్యవేక్షణ జరుపుతున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ సమీక్షాలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అడిషనల్ కలెక్టర్ ముకుంద రెడ్డి, వైద్య విద్య శాఖ డైరెక్టర్ (డీఎంఈ), టిమ్స్ నోడల్ అధికారితో పాటు రోడ్స్ అండ్ బిల్డింగ్స్ శాఖ, మేఘా, సాంకేతిక బృందాల ప్రతినిధులు పాల్గొన్నారు.

టిమ్స్ నిర్మాణపనులను పరిశీలిస్తున్న క్రిస్టిన చొంగ్తు, కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి తదితరులు

తులసీనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుని ఎన్నికలకు నామినేషన్‌లు పూర్తి

తులసీ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుని పోటీలో నామినేషన్ పత్రాన్ని ఎన్నికల అధికారులకు అందజేస్తున్న ఠాకూర్ అంకిత్ సింగ్.

యూసుఫ్‌గూడ, మే 21, ప్రభాతవార్త : ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే బస్తీ ఎన్నికల్లో భాగంగా తులసీ నగర్ సంక్షేమ సంఘం ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకు గాను అధ్యక్షుని పోటీలో ఠాకూర్ అంకిత్ సింగ్ తన నామినేషన్‌ను ఎన్నికల అధికారులకు అందజేశారు. జూన్ 1వ తేదీన ఎన్నికలు జరుగుతాయని ఆదివారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఎన్నికలు నిర్వహించి ఫలితాలు ప్రకటిస్తున్నట్లు ఎన్నికల అధికారులు కె.సురేందర్, గంగ వర ప్రసాద్ రావులు పేర్కొన్నారు.

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి

బోరబండలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పిస్తున్న బోరబండ కార్పోరేటర్ బాబా ఫసియుద్దీన్ సతీమణి హబీబా సుల్తానా

యూసుఫ్‌గూడ, మే 21, ప్రభాతవార్త : భారతదేశాన్ని అనేక రంగాలలో అభివృద్ధి చేయడంతో పాటు ఐటి రంగానికి పునాదులు వేసిన మార్గదర్శి భారత మాజీ ప్రధాని భారతరత్న రాజీవ్‌గాంధీ అనిన బోరబండ కార్పోరేటర్ బాబాఫసియుద్దీన్ సతీమణి హబీబా సుల్తానా కొనియాడారు. బుధవారం బోరబండ కాంగ్రెస్ కార్పోరేటర్ కార్యాలయం వద్ద రాజీవ్‌గాంధీ 34వ వర్ధంతి సందర్భంగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాలులు అర్పించారు. ఈ కార్యక్రమంలో దేవేందర్, సంతోష్, కలీమ్, మున్నా, కృష్ణ, రషీద్, వెంకటలక్ష్మీ, అన్సర్, కవిత, రవి, తదితరులు పాల్గొన్నారు.

అబేద్ అలీని పరామర్శించిన నిరంజన్

కాంగ్రెస్ నాయకులు మహ్మద్ అబేద్ అలీని పరామర్శిస్తున్న రాష్ట్ర వెనుక బడిన తరగతుల కమిషన్ చైర్మన్ జి.నిరంజన్

చార్మినార్,మే 21 ప్రభాతవార్త : అనారోగ్యంతో బాధ పడుతున్న సీనియర్ కాంగ్రెస్ నాయకులు మహ్మద్ అబేద్ అలీని బుధవారం రాష్ట్ర వెనుక బడిన తరగతుల కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ పరామర్శించారు.బహదూర్‌పుర నియోజకవర్గానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు మహ్మద్ అబేద్ అలీకి మూత్ర పిండాల వ్యాధికి సంబంధించిన ఆపరేషన్ జరిగింది.రాష్ట్ర వెనుక బడిన తరగతుల కమిషన్ చైర్మన్ జి.నిరంజన్,బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు జి.కన్నయ్యలాల్,మహ్మద్ ఇక్బాల్,బారి ఖాన్‌లు కాంగ్రెస్ నాయకులు కలిసి బుధవారం మిశ్రిగంజ్‌లోని అబేద్ అలీకి వెళ్లి ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాతబస్తీ ఛత్రినాకలో రక్త దాన శిబిరం

ఛత్రినాక సిఐ ప్రసాద్ వర్మ చాందాయణగుట్ట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి బోయ నరేష్‌కు సర్టిఫికేట్ అందజేస్తున్న దృశ్యం

చార్మినార్,మే 21 ప్రభాతవార్త : పాతబస్తీ ఛత్రినాకలోని ఆర్‌డి ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఛత్రినాక పోలీసుల ఆధ్వర్యంలో రక్త దానం శిబిరం జరిగింది.దక్షిణ మండలం డిసిపి స్నేహా మెహ్రా రక్త దాన శిబిరాన్ని ప్రారంభించారు.దాదాపు నూట నలభై మూడు మంది రక్త దానం చేశారని ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ వర్మ తెలిపారు.దాతలు ఇచ్చిన బ్లడ్‌ను తలసీమియా సికిల్ సెల్ వ్యాధి గ్రస్థుల కోసం అందజేశారు.రక్త దానం చేసిన చాంద్రాయణగుట్ట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి బోయ నరేష్‌తో పాటు పలువురికి ఛత్రినాక పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ వర్మ సర్టిఫికెట్లు అందజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజు యాదవ్,ఛత్రినాక పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

జూన్ 3 నుంచి టిటిడి దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలు

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టిటిడి ఛైర్మన్ బి.ఆర్.నాయుడు. చిత్రంలో యు.రమేష్, వైటివి త్రినాథ్‌బాబు

సైఫాబాద్, మే 21 ప్రభాతవార్త: హిమాయత్‌నగర్‌లోని టిటిడి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు జూన్ 3వ తేదీ నుంచి 7 వ తేదీ వరకు జరగునున్నాయి. ఈ మేరకు బుధవారం తిరుమలలో దీనికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను టిటిడి ఛైర్మన్ బి.ఆర్.నాయుడు, ఎఇవో యు.రమేష్, డోనర్ వై.టి.వి. త్రినాథ్‌బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బి.ఆర్.నాయుడు మాట్లాడుతూ 3వ తేదీ నుంచి 7 వతేదీ వరకు జరిగే ఈ బ్రహ్మోత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీవారి కృపకు పాత్రులు కావాలని విజ్ఞప్తి చేశారు. అంకురార్పణ మొదలు కొని ప్రతి రోజు స్వామికి ప్రత్యేకం పూజలు, తిరువిధుల్లో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి ఊరేగింపులు కొనసాగుతాయని చెప్పారు.

బాలంరాయిలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న సర్వే సత్యనారాయణ

బోయిన్‌పల్లి మార్కెట్‌లో రాజీవ్ గాంధీకి నివాళులర్పిస్తున్న మారెట్ చైర్మన్ ఆనంద్ బాబు తదితరులు

రాజీవ్ గాంధీకి చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న శ్రీనివాస్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి

రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న డాక్టర్ రవి శేఖర్‌రెడ్డి

రాజీవగాంధీ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న జంపన

గోల్నాక అల్వాల్‌లో రాజీవ్ విగ్రహం వద్ద నేతలు

రాజీవ్ గాంధీకి నివాళులు అర్పిస్తున్న హన్మంత్‌రెడ్డి

రాజీవ్ గాంధీ సేవలు అమోఘం

కంటోన్మెంట్‌లో...

కంటోన్మెంట్,మే 21 ప్రభాతవార్త: భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని కంటోన్మెంట్ 3వ వార్డు బాలంరాయి కమాన్ వద్ద ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి మారెట్ తొలి చైర్మన్ ముప్పిడి గోపాల్, కాంగ్రెస్ నాయకులు చిర్రబోయిన సంతోష్ యాదవ్, శ్యామ్‌సన్ రాజు, ఇటుక గోపి, మల్లేశ్, సదానంద్ తదితరులు పాల్గొన్నారు.

బోయిన్‌పల్లి మార్కెట్‌లో

భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం బోయిన్‌పల్లి మార్కెట్‌లో ఏర్పాటు చేసిన వర్ధంతి వేడుకల్లో మార్కెట్ యార్డు చైర్మన్ ఆర్. ఆనంద్ బాబు,వైస్ చైర్మన్ డి.బి.దేవేందర్‌లు పాల్గొని రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

న్యూబోయిన్‌పల్లి ప్లే గ్రౌండ్‌లో...

మన దేశంలో తీవ్రవాద వ్యతరేక దినోత్సవంగా మాజీ ప్రధాని రాజీవగాంధీ వర్ధంతి రోజును నిర్వహిస్తున్నారని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జంపన ప్రతాప్ అన్నారు. రాజీవగాంధీ ముప్పై ఐదవ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకులు న్యూబోయిన్‌పల్లి ప్లే గ్రౌండ్ వద్ద ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి జంపన ప్రతాప్ నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులూ బంగారు సదానంద్. బల్వంత్ రెడ్డి. మారూతి గౌడ్. సాయిబాబా యాదవ్. ముకేశ్ యాదవ్. వరప్రసాద్. శశి. రాజు తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ సర్కిల్‌లో...

కెపిహెచ్బి కాలనీ, మే 21, ప్రభాతవార్త : దేశానికి గాంధీ కుటుంబమే రక్ష అని మాజీ కేంద్రమంత్రి సర్వే సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం రాజీవ్ గాంధీ 34 వర్ధంతి సందర్భంగా కెపిహెచ్బి డివిజన్ అధ్యక్షులు తమ్మినేని ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో బీ బ్లాక్ అధ్యక్షులు తూము వేణు పర్యవేక్షణలో రాజీవ్ సర్కిల్ వద్ద గల విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, టిపిసిసి అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, కూకట్పల్లి నియోజకవర్గం మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డిలు పాల్గొని ఘనంగా రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి సీనియర్ కాంగ్రెస్ నాయకులు సాదు ప్రతాపరెడ్డి, మాజీ వైస్ చైర్మన్ లక్ష్మణ్, ఏ బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, కరుణాకర్ నాయుడు, మేకల మైకల్ తదితరులు పాల్గొన్నారు.

గండి మైసమ్మ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో...

దుండిగల్, మే 21, ప్రభాతవార్త : నేటి యువత రాజీవ్ గాంధీ ఆశయాలను అందిపుచ్చుకుని ఆ దిశగా అడుగులు వేస్తూ ఆయన కలలను సాకారం చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం గండి మైసమ్మ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో స్వర్గీయ మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డిలు పాల్గొని రాజీవ్ గాంధీ చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు రాము గౌడ్, యాదిరెడ్డి కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముత్యంరెడ్డి, జక్కుల మల్లేష్ యాదవ్, కిషోర్ రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతకింది సురేష్, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు .

వెంగళరావ్‌నగర్‌లో...

ముషీరాబాద్, మే 21, ప్రభాతవార్త: దేశసేవ కోసం జీవితాన్ని ధారపోసి, భరతమాత ఒడిలో తుదిశ్వాస విడిచిన దివంగత ప్రధాని, భారత రత్న రాజీవ్ గాంధీ ఆశయాలను కొనసాగిస్తామని యువజన కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ పీ.వి.రవిశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం రాజీవ్‌గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని వెంగళరావ్‌నగర్ ప్రధాన రహదారిలో ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ జైలర్ రంగారావు, ప్రొఫెసర్ టి.వి.రెడ్డి, సారంగరావు, సాంబయ్య, నాగరాజు, సాయి, మైనార్టీ నాయకులు పాషా తదితరులు పాల్గొన్నారు.

అల్వాల్‌లో..

అల్వాల్, మే 21 ప్రభాతవార్త: మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భక్తి శ్రద్ధలుతో నిర్వహించాయి. గోల్నాక అల్వాల్‌లోని రాజీవ్ విగ్రహానికి నేతలు,కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐటితో పాటుగా బ్యాంకింగ్ సంస్కరణలు ద్వారా దేశం ఆర్థికంగా నిలబడడానికి రాజీవ్ గాంధీ ఎనలేని కృషి చేశారని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో నేతలు నిమ్మ అశోక్‌రెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి, సిఎల్ యాదగిరి, సూర్యకిరణ్, సురేందర్ రెడ్డి, కొండల్ రెడ్డి,ఉదయ్, సంజీవ్ కుమార్, వీనస్ మేరి, బబిత, నిర్మల, రమాదేవి ఇతరులు పాల్గొన్నారు.

బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో

నిజాంపేట్, మే 21, ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి రాజీవ్ గాంధీ చిత్రపటానికి పులమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికింది రాజీవ్ గాంధీనే అన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల సరసన భారత దేశాన్ని నిలిపిన ఘనత ఆయనదేనని గుర్తుచేశారు. దేశంలో బీదరికాన్ని పారద్రోలి సమసమాజ స్థాపనకు ఆయన చేసిన కృషి ఎప్పటికి మరవలేమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కోలన్ శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు ధమ్మని శ్రవణ్ కుమార్, ఎన్ఎంసి అధ్యక్షులు కోలన్ రాజశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర మహిళ కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు గంగుల అంజలి యాదవ్, ఎన్ఎంసి మహిళ అధ్యక్షురాలు కడియాల ఇందిరా, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల వెలుస్తున్న ప్రైవేట్ హాస్టల్స్

-పేయింగ్ గెస్ట్ పేరుతో దారుణంగా మోసాలు
-చోద్యం చూస్తున్న ప్రభుత్వ అధికారులు
-లక్షల్లో ఆదాయం. జిహెచ్ఎంసి, ప్రభుత్వ ఆదాయానికి గండి

చిక్కడపల్లి, మే 21 (ప్రభాతవార్త) : అధికారుల పర్యవేక్షణ లోపం , ఎటువంటి అనుమతులు తీసుకోకుండానే ముషీరాబాద్ నియోజకవర్గంలో పుట్టగొడుగుల్లా ప్రైవేట్ హాస్టల్స్ వెలుస్తున్నాయి. ఈ విషయంలో సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప తీసుకుంటున్న చర్యలు శూన్యమనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. హాస్టల్స్ ఎలాంటి పర్మిషన్ లేకుండా గత కొన్ని ఏళ్లుగా చిక్కడపల్లి, జవహర్ నగర్, అశోక్ నగర్, రాంనగర్, బాగ్ లింగంపల్లి, ఆర్టీసీ క్రాస్ రోడ్స్ లో ఈ విధంగా ప్రైవేట్ హాస్టల్స్ విపరీతంగా వెలుస్తున్నాయి. డబుల్ బెడ్ రూమ్, త్రిబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఉంటె చాలు దర్జాగా ప్రైవేట్ హాస్టల్స్ ఏర్పాటు చేసుకుని పోటీపరీక్షల కోసం సన్నద్ధమయ్యే వారి వద్ద విపరీతంగా డబ్బులు వసూలు చేసుకుంటూ కాసులు దండుకుంటున్నారని విమర్శలు వస్తున్నాయి. ఫైర్ సేఫ్టీ , బిల్డింగ్ పర్మిషన్,పోలీస్ పర్మిషన్, జీహెచ్ఎంసి , విద్యుత్ అధికారుల నుండి ఎలాంటి పర్మిషన్ లేకుండా డొమెస్టిక్ సిలిండర్లు వాడుతు బిల్డింగ్ పార్కింగ్ లేకుండా గత కొన్ని ఏళ్లుగా నడుస్తున్నాయి. దాదాపుగా 50 నుంచి 100 హాస్టల్స్ అధికారుల కళ్ళు గప్పి ఇటు ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి హాస్టల్ యజమానులు నెలకు లక్షల్లో సంపాదిస్తున్నరు. జిఎస్టి ,సిజిఎస్టి కట్టకుఢా ప్రభుత్వ ఖజానకు గండి కొడుతున్న వారి పట్ల అధికారులు హాస్టల్లపైన దృష్టి సారించవలసిన అవసరం ఉన్నది. ప్రస్తుతం ప్రైవేట్ హాస్టల్స్ కాస్త రియల్ ఎస్టేట్ ప్రాంగణాలను తలపిస్తున్నాయి. పేయింగ్ గెస్ట్ (పిజి) వసతి గృహాలుగా అద్దెకు ఇవ్వడం ఇప్పుడు నగరంతో పైన పేర్కొన్న ప్రాంతాలలో లాభదాయకమైన వ్యాపారంగా మారింది. ఈ వసతి గృహాలలో చాలా వరకు పయింగ్ గెస్ట్ (పిజి) అని బోర్డులపై రాసి చెప్పుకునే సైన్‌బోర్డులు, కానీ ప్రస్తుతం అవి హాస్టళ్లుగా పనిచేస్తున్నాయి. జీహెచ్ఎంసి కేవలం గెస్ట్‌హౌస్‌లకు ఇచ్చిన ట్రేడ్ లైసెన్స్‌లను మాత్రమే ట్రాక్ చేస్తుంది, కానీ నగరంలో పేయింగ్ గెస్ట్ (శిబి) వసతి గృహాలుగా అనుమతులు లేకుండా ఉన్న హాస్టళ్ల లైసెన్స్‌లను ట్రాక్ చేయకపోవడంతో జీహెచ్ఎంసి లక్షలలో ఆదాయం కోల్పోతోంది. కాగా ప్రస్తుతం పయింగ్ గెస్ట్ కింద వోకోక్కరి వద్ద నుండి రూ.7 వేల నుండి రూ.8 వేల వరకు వసూలు చేస్తున్నారు. మూడు మూడు అంతస్థుల భవనాలను కాస్తా పయింగ్ గెస్ట్ అని చెప్పి నేడు ప్రైవేట్ హాస్టల్స్ గా మార్చుకుంటూ కాసులు దండుకుంటున్నారు. ఒక భవనాన్ని అద్దెకు ఇచ్చి హాస్టల్‌గా మార్చినప్పుడు అది వాణిజ్య భవనంగా మారుతుంది, దీనికి ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి, అయితే, సొంత ఇల్లు లేదా అపార్ట్‌మెంట్‌లోని గదిని అద్దెకు తీసుకుంటే ఇది తప్పనిసరి కాదు. కానీ ప్రస్తుతం ఎన్ని రిజిస్టర్ కాని హాస్టళ్లు పీజీ వసతి గృహాలుగా మారుస్తున్నాయో జీహెచ్ఎంసికి ఖచ్చితమైన ఆలోచన లేదు. జీహెచ్ఎంసి కూడా చూసీచూడనట్లుగా వ్యవరించడంతో ఆదాయాన్ని మాత్రం లక్షల్లో కోల్పోతోంది. కాగా ప్రస్తుతం సర్వీస్ అపార్ట్‌మెంట్లు ఎన్ని ఉన్నాయో వివరాలు జీహెచ్ఎంసి వద్ద లేకపోవడం, ఈ పీజీ వసతిని అద్దెకు తీసుకున్న వారి వివరాలు, కానీ వీరి వద్ద ఆ డేటా నమోదు లేదు. జీహెచ్ఎంసి ట్రేడ్ లైసెన్సులు జారీ చేయబడుతున్న గెస్ట్‌హౌస్‌ల సంఖ్యను మాత్రమే జీహెచ్ఎంసి ట్రాక్ చేస్తుందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఈ విధంగా అధికారుల పర్యవేక్షణ లోపం కారంగంగా పేయింగ్ గెస్ట్ బంగళాలు కాస్తా ప్రైవేట్ హాస్టల్స్ గా మారుతున్నాయి. పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ప్రవేట్ హాస్టల్ యజమానులు, విపరీతంగా డబ్బులు వసూలు చేయడం మరో వైపు జీహెచ్ఎంసి అధికారులను ప్రసన్నం చేసుకోవడానికి ప్రైవేట్ హాస్టల్స్ యజమానులు ఇస్తున్న కాసులకు కక్కుర్తి పడుతూ ప్రభుత్వ ఆద్యానికి గండి కొడుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా హాస్టల్లు నిర్వహిస్తున్నటువంటి బిల్డింగ్ ఓనర్ హాస్టల్ నిర్వాహకులు ఇష్టానుసారంగా వారికి నచ్చిన రీతిలో పేద విద్యార్థుల దగ్గర ఐదు వేల నుండి పదివేల రూపాయలు హాస్టల్ ఫీజుల రూపంలో వసులు చేస్తున్నారు. కనీసం నిబంధనలు పాటించడం లేదు. అశోక్ నగర్ తో పాటు చుట్టుపక్క ప్రాంతాలలో హాస్టల్స్ గదుల్లో ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఆ సూసైడ్ చేసుకున్నటువంటి విద్యార్థికి బిల్డింగ్ ఓనర్ గాని హాస్టల్ నిర్వహిస్తున్న నిర్వాకులు గాని ఆ విద్యార్థికి ఎలాంటి న్యాయం జరిగిన దాఖలాలు లేవు. హాస్టల్ నిర్వాహకులు మేము ఎంత చెపితే అంత అనే విధంగా వ్యవహరిస్తా ఉన్నారు. ఎలాంటి పర్మిషన్ లేకుండా నిర్వహిస్తున్నటువంటి హాస్టల్లో పైన అధికారుల అలసత్వం అక్కడున్న అధికారులు హాస్టల్ యజమానులు ఇస్తున్నటువంటి కాసులకు కక్కుర్తి పడి అటు విద్యార్థుల తల్లిదండ్రులకు ఇటు ప్రభుత్వాలకు గండి కొడుతున్నటువంటి అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

చార్మినార్ వద్ద మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి

చార్మినార్ వద్ద జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ జి.నిరంజన్,కాంగ్రెస్ నాయకులు

చార్మినార్,మే 21 ప్రభాతవార్త : రాజీవ్‌గాంధీ సద్భావనా యాత్ర స్మారక సమితి ఆధ్వర్యంలో బుధవారం చార్మినార్ వద్ద దివంగత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవం కార్యక్రమం జరిగింది.కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన రాష్ట్ర వెనుక బడిన తరగతుల కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ స్వర్గీయ రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.స్వర్గీయ రాజీవ్ గాంధీ ఆత్మకు,18వ తేదీన అగ్ని ప్రమాదంలో మృతి చెందిన 17 మందికి ఆత్మ శాంతి కలగాలని రెండు నిమిషాలు పాటు మౌనం పాటించారు.ఉగ్రవాదాన్ని నిర్మూలించాలని కలిసి కట్టుగా పని చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా జి.నిరంజన్ మాట్లాడుతూ స్వర్గీయ రాజీవ్ గాంధీ ఎన్నో సంస్కరణలు తీసుకు వచ్చి భారత దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన గొప్ప మహనీయుడిని కొనియాడారు. కార్యక్రమంలో రాజీవ్ గాంధీ సద్భావనా యాత్ర సమితి సభ్యులు ఆనంద్,జి,కన్నయ్యలాల్,జి.రాఘవేందర్,బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్,చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి మహ్మద్ ముజీబుల్లా షరీఫ్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు మూసా కాశిం,వెంకటేష్ ముదిరాజ్,దినేష్,కృష్ణ కుమార్, ఇక్బాల్.జబ్బార్,భాగేందర్ సింగ్,అశోక్‌రెడ్డి, విజయ్‌కుమార్, హైదర్ అలీ జాఫ్రీ,అస్కర్ అలీ బేగ్,నర్సింహా,టి.చందూ,రుక్మిణి నాయక్ ,శ్రీనివాస్,బారిఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అంబటి కృష్ణమూర్తిపై జరిగిన దాడి ఖండన

సైఫాబాద్, మే 21 ప్రభాతవార్త: ఐఎన్‌టియుసి (ఆర్) జాతీయ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తిపై మంగళవారం బషీర్‌బాగ్‌లోని ప్రెస్‌క్లబ్‌లో రాజ్యసభ మాజీ సభ్యుడు, ఐఎన్‌టియుసి మాజీ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి వర్గీయులు దాడి చేయడాన్ని పలు ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టి, ప్రజా సంఘాలు తీవ్రంగా ఖండించాయి. బుధవారం నాడిక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ సంఘాల నేతలు జె.బి.రాజు, సత్యం, గోల్లపల్లి దయానందరావు, పోకల కిరణ్, నాగుల శ్రీనివాస్‌యాదవ్, బూదాల అమర్‌బాబు తదితరులు మాట్లాడుతూ ఐఎన్‌టియుసి నాయకుడిగా చెప్పుకుంటున్న సంజీవరెడ్డి వర్గీయులు అంబటి కృష్ణమూర్తిపై చేసిన దాడి యావత్ అనగారిని వర్గాలపై జరిగిన దాడిగా భావిస్తున్నామని, ఇది కేవలం పిరికిపందల చర్య అని విమర్శించారు. తక్షణమే వారిపైన క్రిమినల్ చర్యలు తీసుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

గిరిజన సంక్షేమ హాస్టల్ బిల్లు వెంటనే మంజూరు చేయాలి

-ఎంపి ఆర్.కృష్ణయ్య డిమాండ్

హైదరాబాద్, మే 21,ప్రభాతవార్త: ఒక సంవత్సరం నుండి పెండింగ్ లో ఉన్న గిరిజన సంక్షేమ శాఖ హాస్టల్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం గిరిజన విద్యార్థులు బి.సి భవన్‌కు వచ్చి హాస్టళ్ళు మూసివేయకుండా చూడాలని కృష్ణయ్యకు విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఇటీవల ఎస్సీ/ బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో పెండింగ్ బిల్లులు మంజూరు చేశారని కానీ ఎస్టీ హాస్టల్లో మెస్ బిల్లులు చెల్లించలేదన్నారు. బిల్లుల టోకెన్లు తిరస్కరిస్తే ఇంకో సంవత్సరం వరకు మంజూరయ్యే అవకాశం లేదని దీంతో హాస్టల్స్ నిర్వహించే అవకాశం లేక హాస్టళ్ళు మూసివేసే పరిస్థితి ఏర్పడుతుందన్నాని కావున ప్రభుత్వం వెంటనే స్పందించి బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్ పౌర హక్కుల సంఘం విచారం

సైఫాబాద్, మే 21 ప్రభాతవార్త: ఛత్తీస్‌ఘడ్, నారాయణ్‌పూర్, బీజాపూర్ జిల్లాల సరిహద్దుల్లోని మాడ్ సమీపంలో మావోయిస్

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

-ఎంపి ఈటెల,శ్రీగణేష్

వాసవి నగర్‌లో ఉమెన్ కేర్ ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఎంపీ ఈటెల రాజేందర్

కంటోన్మెంట్,మే 21 ప్రభాతవార్త: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు ముందుండాలని మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌లు తెలిపారు. కంటోన్మెంట్ 5వ వార్డు వాసవి నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఉమెన్ కేర్ అండ్ పాలిక్లీనిక్‌ను వారు ప్రారంభించారు. కార్పోరేట్ రెస్పాన్‌సిబులిటిలో భాగంగా వైద్యులు ముందుకు వచ్చి లాభాలు ఆశించకుండా వైద్య సేవలు చేస్తే డాక్టర్లకు, ఆసుపత్రులకు గుర్తింపు వస్తుందన్నారు. ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ సుప్రియా మరిపల్లి, ఆనంద్ మరిపల్లి సారధ్యంలో మహిళల కొరకు ఈ ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏసిపి రమేష్, మోండా కార్పోరేటర్ కొంతం దీపిక, బిజెపి నాయకులు బానుక నర్మద మల్లికార్జున్, సామాజిక కార్యకర్త తేలుకుంట సతీష్ గుప్త పాల్గొన్నారు.

కె.ఏ.పాల్ సభకు అనుమతి ఇవ్వకూడదు : బాస్కర్ ముల్కల

కంటోన్మెంట్,మే 21 ప్రభాతవార్త: ప్రపంచ శాంతి పేరుతో కెఏ.పాల్. ఈ నెల 24న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించ తలపెట్టనున్న నకిలీ గ్లోబల్ పీస్ ప్రేయర్ సభకు అనుమతి ఇవ్వకూడదని భారత క్రిస్టియన్ కౌన్సిల్ పొండర్ అధ్యక్షులు బిషప్ రైట్ రెవరెండ్ బాస్కర్ ముల్కల నార్త్‌జోన్ డిసిపి సాధన రష్మిపెరుమాల్‌కు ఫిర్యాదు చేశారు.

కూకట్‌పల్లి నల్లచెరువును పరిశీలించిన ఎమ్మెల్యే కృష్ణారావు

అధికారులతో కలిసి చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కెపిహెచ్బి కాలనీ, మే 21, ప్రభాతవార్త

కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హైడ్రాధికారులతో వాటర్ వర్క్స్, జిహెచ్ఎంసి అధికారులతో కలిసి బుధవారం నల్లచెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా వర్షాకాలంను దృష్టిలో పెట్టుకుని చెరువు అభివృద్ధి కొరకు ఇప్పటికే నిధులు మంజూరైన కారణంగా త్వరితగతిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలని సూచించారు. అలాగే వర్షాలు పడినప్పుడు డ్రైనేజ్ వ్యవస్థ అస్తవ్యస్తం కాకుండా పైప్‌లైన్ నిర్మాణం, రిటర్నింగ్ వాల్స్ చేపట్టి దిగువకు నీరు వెళ్లే విధముగా చూడాలని అన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులకు సూచనలు చేశారు. జిహెచ్ఎంసి, వాటర్ వర్క్స్ అధికారులతో సమన్వయం చేసుకుని ఎక్కడ ఎటువంటి ఇబ్బంది లేకుండా సత్వరమే పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కృష్ణారావు అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైడ్రా అధికారులు డి.ఈ నాగరాజు, జి.హెచ్.యం వాటర్ వర్క్స్ అధికారులు సి.సి చిన్న రెడ్డి, నిఖిల్ రెడ్డి, నాగ ప్రియా, ప్రసన్న పాల్గొన్నారు.

నేడు బేగంపేట రైల్వేస్టేషన్ ప్రారంభించనున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న భరత్‌గౌడ్ తదితరులు

కంటోన్మెంట్, మే 21 ప్రభాతవార్త:

బేగంపేట రైల్వే స్టేషన్‌ను ప్రపంచ స్థాయి సౌకర్యాలతో అభివృద్ధి జరిగిందని, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి గురువారం ఉదయం ప్రారంభిస్తారని బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు గుండగోని భరత్‌గౌడ్ తెలిపారు. సికింద్రాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రూ. 26.55 కోట్ల బడ్జెట్‌తో, బేగంపేట స్టేషన్‌ను అధునిక సౌకర్యాలతో పునరాభివృద్ధి చేశారన్నారు. బుకింగ్ కార్యాలయం, వెయిటింగ్ హాల్‌తో కొత్త స్టేషన్ భవనం, ప్రయాణీకుల ర్యాంప్‌లతో 12 మీటర్ల ఫుట్ ఓవర్‌బ్రిడి, 2 లిఫ్ట్‌లు, 4 ఎస్కలేటర్లు అంతే కాకుండా దివ్యాంగజన సౌకర్యాలు, ఆధునిక టాయిలెట్‌లు సిద్ధం చేశారన్నారు. ల్యాండ్‌స్కేపింగ్, రిట్‌ఫారమ్ రీసర్ఫేసింగ్, అదనపు ప్లాట్‌ఫారమ్ షెల్టర్.ఎక్కడ లేని విధంగా నిర్మించారన్నారు. ఈ విలేఖరుల సమావేశంలో పార్లమెంట్ కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, కార్పొరేటర్‌లు కొంతం దీపికా, సూచిరిత్ర, మీడియా ఇంచార్జ్ రామువర్మ, డివిజన్ అధ్యక్షుడు సందీప్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన లబ్దిదారులకు ముబారక్ చెక్కులు పంపిణీ

ముబారక్ చెక్కులను పంపిణీ చేస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి, మే 21 ప్రభాతవార్త:

హిమాయత్‌నగర్ ఎమ్మార్వో కార్యాలయంలో నలుగురికి షాదీ ముబారక్ చెక్కులను లబ్దిదారులకు స్థానిక తహశీల్దార్ సంధ్యారాణితో కలిసి బుధవారం ముషీరాబాద్ శాసనసభ్యులు ముఠాగోపాల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నియోజకవర్గం మీడియా ఇంచార్జ్ ముచ్చకుర్తి ప్రభాకర్, రాంనగర్, కవాడీగూడ డివిజన్‌ల అధ్యక్షులు శంకర ముదిరాజ్, వల్లాల శ్యామ్ యాదవ్, కార్యదర్శి సాయికుమార్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు. తాను ఎమ్మెల్యే ఇప్పటివరకు వేల మందికి ఈ పథకం కింద అర్హులైన లబ్దిదారులకు అందించడం జరిగిందని, ఇంకా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు త్వరలోనే చెక్కులను అందించే విధంగా తనవంతు కృషి చేస్తానన్నారు.

'వేసవి శిక్షణా శిబిరం ముగింపు వేడుకలు'

చిక్కడపల్లి, మే 21 ప్రభాతవార్త: బాలానంద ట్రస్ట్, ఆంధ్రా బాలానంద సంఘం సంయుక్త ఆధ్వర్యంలో 'వేసవి శిక్షణా శిబిరం ముగింపు వేడుకలు' ఘనంగా నిర్వహించబోతున్నట్లు నిర్వాహక సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు జెవి.కామేశ్వరి, జి.స్వర్ణబాల వివరించారు. 28న సాయంత్రం నారాయణగూడలోని బాలానందం హాల్‌లో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశ్రాంత ఇంజనీర్, బాలానందం పూర్వ సభ్యుడు ఎన్‌వి.అశోక్ హాజరవుతారని వివరించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలుంటాయన్నారు.

రజకుల విద్యుత్ పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి : పెదలంక నవ్య

నిజాంపేట్, మే 21, ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రజకుల విద్యుత్ బకాయిలను చెల్లించాలని రజక సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పెదలంక నవ్య డిమాండ్ చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం హాయంలో ప్రతి రజక కుటుంబానికి ఇస్త్రీ, వాషింగ్ మెషిన్ల వాడుక కొరకు 250 యూనిట్ల కరెంటు ఉచితంగా సరఫరా చేయడం జరిగిందన్నారు. నేటి రేవంత రెడ్డి సర్కార్ కరెంట్ బకాయిలు చెల్లించకుండా పథకాన్ని నీరు కార్చే యత్నం చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే విద్యుత్ శాఖని రజక సంఘం బకాయి బిల్లులను చెల్లించాలని కోరారు. రజక యువకుల ఉపాధి హామీ కొరకు ప్రభుత్వం 5 లక్షల నుండి 10 లక్షల రూపాయల వరకు ఎటువంటి హామీ లేకుండా రుణాలు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. రజక వృత్తిలో కార్పొరేట్ సంస్థల రాకతో తమ వృత్తి చిన్నాభిన్నం కాబోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రజక వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. గత ప్రభుత్వంలో ఆధునిక ధోబిగాట్ల నిర్మాణం కొరకు ప్రతి మున్సిపల్ కేంద్రంలో సుమారు రెండు కోట్ల రూపాయల వరకు నిధులతో ప్రారంభించిన నిర్మాణ పనులు ప్రభుత్వం మారడంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయని తెలిపారు. తిరిగి రేవంతరెడ్డి ప్రభుత్వం వెంటనే పనులు ప్రారంభించి పూర్తిచేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో చెరువులు కుంటలు అన్యాక్రాంతం అవడంతో రజకులు బట్టలు ఉతకడానికి అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రజక జనాభా ప్రాతిపదికంగా గ్రామాల్లో ధోబిగాట్లను నిర్మాణం చేసి ఇవ్వాలని కోరారు. రజక వృత్తిలో కొనసాగుతూ 50 సంవత్సరాలు పైబడిన వారికి ప్రభుత్వం పెన్షన్ అందజేయాలన్నారు. రజక సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. రజకుల హక్కుల సాధనకై సమిష్టి పోరాటం అవసరమని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రజకుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

బిసి విద్యార్థులకు పదివేల ర్యాంకు నిబంధన ఎత్తివేయాలి

-కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేసి న్యాయం చేయాలి

-బిసి విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్‌గౌడ్

హైదరాబాద్, మే 21,ప్రభాతవార్త:

ఇంజనీరింగ్ విద్యలో బీసీ విద్యార్థులకు పదివేల ర్యాంకు నిబంధన ఎత్తివేయాలని బిసి విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు విక్రమ్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం సంఘం కార్యాలయంలో బిసి సంక్షేమసంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్‌తో కలిసి మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2008లో అప్పుడు ప్రభుత్వంతో కొట్లాడి ఫీజుల రియంబర్స్మెంట్ స్కీమ్ సాధించామని, బీసీఈ లో ఉన్న ముస్లిమ్స్ మైనారిటీలకు ర్యాంకులతో సంబంధం లేకుండా పూర్తి ఫీజులు ఇస్తున్నారని కానీ బీసీ విద్యార్థులకు మాత్రం 10,000 ర్యాంకు నిబంధిత పెట్టి మిగిలిన వారికి కేవలం 35000 మాత్రమే ఇస్తున్నారని దానివల్ల టాప్ టెన్ కాలేజీల్లో సీట్లు వచ్చినా అక్కడ ఫీజులు లక్ష నుంచి 2 లక్షలు ఉండడంతో కట్టుకోలేక చదువుకు దూరం అవుతున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే బీసీ విద్యార్థులకు ర్యాంకు నిబద్ధత ఎత్తివేస్తామని మిగతా ఎస్సీ ,ఎస్టీ ,మైనార్టీ విద్యార్థుల, బీసీ విద్యార్థులకు కూడా పూర్తి ఫీజులు చెల్లిస్తామని కామారెడ్డి డిక్లరేషన్ తో పాటు కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టారని కాబట్టి వెంటనే ఈ పదివేల ర్యాంకు నిబద్ధత ఎత్తివేసి

సమావేశంలో మాట్లాడుతున్న విక్రంగౌడ్, కుల్కచర్ల శ్రీనివాస్, మహేష్‌యాదవ్ తదితరులు

బీసీ విద్యార్థులకు న్యాయం చేయాలని లేదంటే వేల మంది విద్యార్థులతో పెద్ద ఉద్యమిస్తామనిహెచ్చరించారు. ఇంజనీరింగ్ బి క్యాటగిరి దోపిడిని అరికట్టాలని న్యాయమైన ర్యాంకులు వచ్చిన వారికేబి కేటగిరిలో సీట్లు ఇవ్వాలని కానీ ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలో ఒక మాఫియాలా తయారై కనీసం ఎంసెట్లో క్వాలిఫై కానీ వారికి కూడా మార్కెట్లో కూరగాయల సీట్లను అమ్ముకుంటున్నారని దీనిపై ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని విక్రమ్ గౌడ్ గారు కోరారు. ఈకార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొడుగు మహేష్ యాదవ్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు ఇంద్రం రజక ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

భట్టి విక్రమార్క మాటలు హాస్యాస్పదం : సాయిబాబా

ముషీరాబాద్, మే 21, ప్రభాతవార్త:

రాబోయే పదేళ్లు మేమే అధికారంలో ఉంటామంటూ డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క వ్యాఖ్యానించటం హాస్యాస్పదంగా ఉందని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా అన్నారు. బుధవారం టీడీపీ హైదరాబాద్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే కాంగ్రెస్ పరిస్థితి బట్టబయలవుతుందని భయపడి, గత ఆరేడు నెలలుగా వాయిదా వేస్తున్న తెలంగాణ ప్రభుత్వం, రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలను కూడా వాయిదా వేస్తుందనటంలో సందేహం లేదని విమర్శించారు. కాంగ్రెస్ నేతలు పగటి కలలు కనటం మాని, వాస్తవాలను గమనించాలని సూచించారు. ఒకవైపు పాతబస్తీలో అగ్నిప్రమాదం జరిగి 17మంది అగ్నికి ఆహుతి అయితే ఒక్క మంత్రి కూడా సంఘటనా స్థలాన్ని సందర్శించి, బాధితులను పరామర్శించలేదని ఆరోపించారు. గ్రామ స్వరాజ్యమే ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మలని చెప్పిన గాంధీ మహాత్ముని వారసులుగా చెప్పుకునే కాంగ్రెస్ నాయకులు గ్రామాలకు, స్థానిక సంస్థలకు ఎన్నికలు జరపకుండా గ్రామ వ్యవస్థను దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్‌కు దమ్ముంటే వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్, కిరణ్, తడక వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సాయిబాబా

మహానాడు 2025ను విజయవంతం చేయాలి: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ ఎన్టీ రామారావు గారి 102 జయంతి సందర్భంగా నిర్వహించనున్న మహానాడు-2025ను విజయవంతం చేయాలని సాయిబాబా పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా మహానాడును నిర్వహించుకోవటం ఆనవాయితీగా వస్తోందని, అందులో భాగంగా ఈనెల 27, 28, 29 తేదీలలో కడపలో జరగబోయే మహానాడు-2025 నిర్వహణ కమిటీలను అధిష్ఠానం ఇటీవలే విడుదల చేసిందని తెలిపారు. తెలుగు దేశం అభిమానులు, కార్యకర్తలు,నాయకులు, శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున ఈ మహానాడుకు తరలివచ్చి, జయప్రదం చేయాలని కోరారు.

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుపై విమర్శలు చేయించడం తగదు

సైఫాబాద్, మే 21 ప్రభాతవార్త: కాంగ్రెస్ పార్టీలోకి కొత్తగా వచ్చిన గడ్డం వంశీకృష్ణ పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గంలో ఎంపిగా భారీ మేజారిటితో గెలిపించిన ఘనత రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుదేనని ప్రజా సంఘాల జెఎసి ఛైర్మన్ గంజల కాంతం, ఎస్సీ కార్పోరేషన్ మాజీ ఛైర్మన్ పడమర్తి రవి స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సరస్వతి పుష్కారాలు ప్రారంభోత్సవం సందర్భంగా వంశీకృష్ణకు ప్రోటోకాల్ పాటించలేదని శ్రీధర్‌బాబుపై నిందలు మోపడం, మాల మహానాడు నాయకులచే ధర్నాలు చేయించడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రోటోకాల్‌కు శ్రీధర్‌బాబుకు ఏలాంటి సంబంధం లేదని, ప్రోటోకాల్ చూసుకోవాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్, ఆర్‌డిఓ, ఎంఆర్‌ఓకు ఉంటుందన్నారు. వెంకటస్వామి కుటుంబంలో ఇద్దరూ ఎమ్మెల్యేలు, ఒక ఎంపి ఉన్నారంటే శ్రీధర్‌బాబు సహకారమేనని, ఎన్నికలప్పుడు డబ్బులు ఇచ్చి గెలిపించడానికి శ్రీధర్‌బాబు కావాలని, అయిపోయిన తరువాత నోటికి ఇష్టం వచ్చినట్లు తిట్టడం చేయడం మంచిది

సమావేశంలో మాట్లాడుతున్న గజ్జల కాంతం. చిత్రంలో పిడమర్తి రవి తదితరులు

కాదన్నారు. వంశీకృష్ణ ఎంపిగా 55 వేల మేజారిటితో గెలవడానికి శ్రీధర్‌బాబేనని, దళితులను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవడం వివేక్ కుటుంబానికి పరిపాటియేనని వారు విమర్శించారు.

పేద ప్రజలకు అండగా రాష్ట్రం ప్రభుత్వం

-ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

-మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ



అత్తాపూర్ మే21,ప్రభాతవార్త : పేద ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వ అండగా నిలుస్తుందని మహిళలకు స్వయం ఉపాధి కల్పన, ఆర్థిక స్వాలంబనే ధ్యేయం మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుంది రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు.ఇందిరమ్మ మైనార్టిస్ మహిళా శక్తి పథకం రేవంతన్న భరోసా కార్యక్రమంలో భాగంగా బుధవారం రాజేంద్రనగర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ సంస్థ ద్వారా ఉచితంగా 200 మంది మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్లను మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్,జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్లుతో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... సిఎం రేవంత్ రెడ్డి మహిళల పక్షపాతి అని మహిళలు ఆర్థికంగా ఎదగాలని అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వం పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు,పాల్గొన్నారు.

సికింద్రాబాద్ బాలింరాయిలోని డ్రిమ్‌ల్యాండ్ గార్డెన్స్‌లో హైదరాబాద్ నార్త్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైకిల్స్ పంపిణీ చేస్తున్న దృశ్యం

గాంధీనగర్ డివిజన్‌లో పెండింగ్ పనులకు త్వరగా ఆమోదం ఇవ్వండి

-జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ రవికిరణ్‌తో సమావేశమైన గాంధీనగర్ కార్పొరేటర్ పావనీ వినయకుమార్

జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ రవికిరణ్‌తో సమావేశమైన గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్

చిక్కడపల్లి, మే 21 ప్రభాతవార్త: గాంధీనగర్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న పనులకు వెంటనే అనుమతులు మంజూరు చేసి పనులను ప్రారంభించాలని స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ జిహెచ్ ఎంసి జోనల్ కమిషనర్ రవి కిరణ్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం డివిజన్‌కు సంబంధించిన సమస్యలపై బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయకుమార్‌తో కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పలు సమస్యలను జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. సానిటైజేషన్ విభాగం పనులపై డివిజన్ అభివృద్ధి అంశాలపై చర్చించిన అనంతరం పెండింగ్ లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని, సానిటైజేషన్ విభాగం చేపడుతున్న పనులను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో డివిజన్ అభివృద్ధి కొరకు ప్రస్తావించిన సమస్యలకు ఆమోదం పొందినప్పటికీ మరికొన్ని అంశాలపై దృష్టి సారించి అభివృద్ధిలో తమకు సహకరించాలని కార్పొరేటర్ కోరారు.సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ డివిజన్ అభివృద్ధికి కావలిసిన చర్యలు వెంటనే చేపడతామని హామీ ఇచ్చారు.

శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలి

- టోలిచౌకి పీఎస్ ప్రారంభోత్సవంలో సిపి సివి.ఆనంద్

తొలి ఫిర్యాదును స్వీకరిస్తున్న నగర సీపీ సీవీ.ఆనంద్

హైదరాబాద్, మే21, ప్రభాతవార్త: శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని నగర పోలీస్ కమిషనర్ సీవీ.ఆనంద్ తెలిపారు. గోల్కొండ్, మోహిదిపట్నం,ఫిలింనగర్ పీఎస్‌లను విభజించి నూతనంగా ఏర్పాటైన టోలిచౌక్ పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆయన ప్రారంభించి మానిటరింగ్‌ను పరిశీలించారు. ఫిర్యాదుల స్వీకరణలో నిర్లక్ష్యం కాకుండా చూసుకోవాలని, దర్యాప్తు, విచారణలను వేగవంతం చేసి నిందితులను గుర్తించాలని ఆయన సూచించారు. పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్ సిబ్బంది కూడా ప్రజల భద్రతపై దృష్టిసారించి తగిన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీ చంద్రమోహన్ తదితర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

స్వామి వారి ఆశీస్సులు ప్రజలపై ఎల్లప్పుడు ఉండాలి : ఎమ్మెల్యే శ్రీగణేష్

అడ్డగుట్ట,మే 21 ప్రభాతవార్త:

తుకారాంగేట్ పహాడీహన్ మాన్ దేవాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్, నక్క మధు తదితరులు

స్వామి వారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలపై ఎల్లప్పుడు ఉండాలని ,ప్రజలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామి వారిని వేడుకున్నట్లు కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. తుకారాంగేట్‌లో ప్రసిద్ధిగాంచిన శ్రీ పహాడి హన్‌మాన్ దేవాలయంలో 41 రోజుల పాటు హన్‌మాన్ దీక్ష చేపట్టిన భక్తులు ఇరుముడులు కట్టుకొని కొండగట్టు అంజనేయ స్వామి దర్శనానికి వెళ్తున్న సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వారిని సాగనంపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి నక్క మధు,ప్రతినిధులు వెంకటేశ్, గౌడ్, రమేష్ బాబు, మోండా డివిజన్ కాంగ్రెస్ నేత చి ర్రబోయిన సంతోష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు అందజేస్తాం : ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

నార్సింగి, మే 21 ప్రభాతవార్త :

ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు పట్టాలు అందజేస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, కమీషనర్ ప్రదీప్ కుమార్‌ల దృశ్యం.

అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు ఇస్తామని రాజేంద్ర నగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం ఎమ్మెల్యే నివాసం వద్ద మణికొండ మున్సిపల్ కమీషనర్‌తో కలిసి 16.మంది నిరుపేదలకు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పట్టాలు అందజేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఆది నుంచి పేదరిక నిర్మూలన కోసం అణగారిన వర్గాలకు అండగా నిలుస్తున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని పేర్కొన్నారు. ఈ దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చినన్ని ఇళ్ల పట్టాలు మరే ఇతర పార్టీ ఇవ్వలేదని తెలిపారు. కాంగ్రెస్ అంటేనే కష్టాలను దూరం చేసే పార్టీ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయత్వంలో తెలంగాణ రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు పెద్దపీట వేశారని, అర్హులైన పేదలందరిని గుర్తించి పెద్ద ఎత్తున ఇళ్లపట్టాలు ఇస్తున్నారని వివరించారు. పేదల పక్షపాతి సీఎంగా ఉంటే ఎంత మేలు జరుగుతుందో ఇప్పుడు అర్థమవుతుందని ప్రకాశ్‌గౌడ్ తెలి పారు. నిరంతరం నిరుపేదల మేలు కోసం పరితపించే సీఎం రేవంత్‌రెడ్డి అని, ఇలాంటి నాయకుడు సీఎం అవ్వడం మన అదృష్టమన్నారు. ఈ ఇళ్లపట్టాల పంపిణీ ఇప్పుడే ఆరంభమైందని, అర్హత కలిగిన వారంతా దరఖాస్తు చేసుకోవచ్చని, అందరికి ఇళ్లు వచ్చేంత వరకు ఈ ప్రక్రియ కొనసాగుతూనే ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో లబ్దిదారులు, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చిక్కడపల్లి మెట్రో పిల్లర్ వద్ద గుర్తు తెలియని మృతదేహం లభ్యం

చిక్కడపల్లి, మే 21 ప్రభాతవార్త: చిక్కడపల్లి మెట్రో పిల్లర్ నెంబరు 1088 వద్ద ఒక గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానిక పోలీసులు కనుగొన్నారు. స్థానిక ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఒక వ్యక్తి ఆపస్మారకస్థితిలో వ్యక్తి చిక్కడపల్లి మెట్రోపిల్లర్ వద్ద ఉన్న విషయాన్ని స్థానికులు చిక్కడపల్లి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ నాగరాజు నేతృత్వంలో పోలీసులు సంఘటనాస్థలాన్ని చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి వయస్సు దాదాపు 50 సంవత్సరాలు, 5.5 అడుగుల ఎత్తు, నీలిరంగు చొక్కా, తెల్లటి రంగు లుంగీతో నల్లటి చెప్పులు వేసుకుని ఉన్నట్లు వివరించారు. మృతుడి వివరాల గురించి చుట్టుపక్క ప్రాంతాల వారిని వాకాబు చేయగా గుర్తు పట్టకపోవడంతో, అతడు అతను చూడడానికి బిక్షగాడిలా మాసిన దుస్తుల్లో ఉన్నాడు. స్థానిక ఇన్‌స్పెక్టర్ రాజూనాయక్ పర్యవేక్షణలో ఎస్ఐ నాగరాజు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు జరిపారు.

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస

రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి : కార్పొరేటర్

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి

సైదాబాద్, మే 21 ప్రభాతవార్త: ఐఎస్ సదన్ డివిజన్ కృష్ణా నగర్ కాలనీలో రూ.15.40లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్వేత మాట్లాడుతూ రోడ్డు నిర్మాణంలో తగిన నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, కాలనీవాసులు జైపాల్‌రెడ్డి, శ్రీను, సునీల్, ప్రవీణ్, సత్యం, నవీన్, విజయ్, రమేష్, వంశీ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బోడుప్పల్‌లో నాలా, బాక్స్ డ్రైన్‌కి రూ.3.45 నిధులు మంజూరు

తోటకూర వజ్రేష్ యాదవ్, తోటకూర అజయ్ యాదవ్ , సుమన్ నాయక్ ను సన్మానిస్తున్న 21వ డివిజన్ నాయకులు

బోడుప్పల్, మే 21 ప్రభాతవార్త; బోడుప్పల్ నగరపాలక సంస్థ కట్టమైసమ్మ వైన్స్ నుండి సాయిభవానినగర్, కాలని వరకు గల మిగులు నాలా, బాక్స్ డ్రైన్ నిర్మాణ పనుల కొరకు సిడిఎంఏ రూ,3.45 కోట్ల నిధులు మంజూరు చేశారు. నిధుల మంజూరుకి సహకరించిన మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ , కృషిచేసిన మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ , మాజీ కార్పొరేటర్ భూక్య సుమన్ ను 21 డివిజన్ నాయకులు ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు . మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ మాట్లాడుతూ.... కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత బోడుప్పల్ నగర పాలక సంస్థ అభివృద్ధికి అత్యధిక నిధులు సమకూర్చడంలో తోటకూర వజ్రేష్ యాదవ్ కృషి ఎంతో ఉందని, అనతి కాలంలోనే బోడుప్పల్ అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని తెలిపారు, ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ , మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ , మాజీ కార్పొరేటర్ సుమన్ నాయక్ డివిజన్ అధ్యక్షులు ఎలిగొండయ్య, ఉపేందర్ రెడ్డి, సూర్యనారాయణ, అనిల్ రెడ్డి, యూత్ అధ్యక్షులు సునీల్, శ్రీనివాస్, గిరి ప్రసాద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లిలో హైడ్రా కూల్చివేతలు

-రోడ్డు కబ్జా చేసిన సెజ్ స్కూల్ యాజమాన్యం..

-ఆక్రమించిన ప్రాంతాన్ని కూల్చివేసిన అధికారులు

మేడిపల్లిలో సెజ్ స్కూల్ ఆక్రమ కట్టడాన్ని కూల్చుతున్న హైడ్రా

మేడిపల్లి మే21ప్రభాతవార్త : మేడిపల్లి మండలం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్,మేడిపల్లి సర్వే నంబర్ 26ఏ, సిపీఆర్ఐ పవర్ సంస్థ, సెజ్ స్కూల్ ప్రాంగణంలో ఆర్ఏఆర్ కాలనీకి సంబందించిన రోడ్డు కబ్జా చేసి ఆ ప్రాంతం లో నిర్మాణాలు చేపట్టారని కాలనీ వాసులు ఇటీవల హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు బుధవారం హైడ్రా అధికారులు చేరుకుని సిఐ. సైదులు నేతృత్వంలో జేసిబీలతో రోడ్డు ఆక్రమణలను పూర్తిగా నేలమట్టం చేశారు. గత 15 సంవత్సరాలుగా రోడ్డు కబ్జా పై పోరాడుతున్నామని,హైడ్రా మూలంగా ఇన్నేళ్లకు తమ కాలనీకి సంబంధించిన రోడ్డు వినియోగంలోకి రానుందని సంతోషం వ్యక్తం చేశారు.

గౌతమి నగర్‌లో సమస్యల పరిష్కారానికి కృషి : లచ్చిరెడ్డి

కార్పొరేటర్ లచ్చిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న గౌతమి నగర్ ప్రతినిధులు

వనస్థలిపురం మే 21,ప్రభాతవార్త :
బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని గౌతమి నగర్ నూతన కార్యవర్గం ఏర్పరచుకున్న సందర్భంగా సంక్షేమ సంఘం సభ్యులు ఈ రోజు బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి గారిని కలసి కాలనీలో అభివృద్ధి మరియు సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గారు నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది అనంతరం కార్పొరేటర్ గారు మాట్లాడుతూ కాలనీలో త్వరలోనే ప్రతి సమస్య పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది.. ఈ కార్యక్రమంలో కాలనీ నూతన అధ్యక్షులు సుధాకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కిషన్, ట్రెజరర్ సాయిబాబా, ఉపాధ్యక్షులు రాజు, నారాయణరావు, జాయింట్ సెక్రెటరీ గోపీచంద్, హరి రెడ్డి, సుకుమార్, ఆంజనేయులు, లోకేష్ చారి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ కరుణాకర్, శి.బీ రెడ్డి, రవికుమార్, కార్యవర్గ సభ్యులు భాస్కర్ గౌడ్, జగన్, శ్రీ రామ్, ప్రవీణ్ మరియు ఉన్నారు.

రాజీవ్ గాంధీకి నేతల నివాళి

మల్కాజిగిరి మే21,ప్రభాతవార్త : గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని న్యూ మిర్జల్ గూడా లో మైనంపల్లి హన్మంతరావు ఆదేశాల మేరకు బి బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చంద్రశేఖర్, విగ్రహానికి పులా మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు యూత్ కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ మహిళా నాయకురాళ్ళు, కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బోడుప్పల్లో స్వర్గీయ రాజీవ్ గాంధీ కి నివాళులర్పిస్తున్న తోటకూర వజ్రేష్ యాదవ్, పోగుల నరసింహారెడ్డి ,తోటకూర అజయ్ యాదవ్ తదితదురులు

రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న లింగాల కిషోర్‌గౌడ్, శశిధర్‌రెడ్డి, షరీఫ్

రామంతాపూర్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఉప్పల్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ నేతలు



రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న టియుఎఫ్‌డిసి ఛైర్మన్, డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి: చిత్రంలో చల్లా బాల్‌రెడ్డి, సిద్దాల శ్రీశైలం, గజ్జెల రాంచందర్, మాదరి శ్రీనివాస్ తదితరులు

రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం

బోడుప్పల్లో

బోడుప్పల్, మే 21 ప్రభాతవార్త ; మాజీ ప్రధాని భారత రత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా బోడుప్పల్ నగరపాలక సంస్థ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, బోడుప్పల్ పట్టణ అధ్యక్షులు అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి , మాజీ మేయర్ తోటకుర అజయ్ యాదవ్ , నాయకులు రాపోలు రాములు, కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు,కొత్త చందర్ గౌడ్ , రాసాల వెంకటేశ్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు ఫకీర్ హరినాద్ రెడ్డి, విశ్వం గుప్తా తదితరులు పాల్గొని వారి చిత్రపటానికి పూలు వేసి ఘన నివాళులర్పించారు.

కొత్తపేట చౌరస్తాలో

ఎల్‌బినగర్, మే 21 ప్రభాతవార్త: దేశానికి రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని కొత్తపేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లింగాల కిషోర్ గౌడ్ పేర్కొన్నారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 34 వ వర్ధంతి సందర్భంగా లింగాల కిషోర్ గౌడ్ ఆధ్వర్యంలో కొత్తపేట చౌరస్తాలోని రాజీవ్ గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కిషోర్ గౌడ్ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ ఆశయాల దిశగా నేటి యువత ముందడుగు వేయాలన్నారు. శశిధర్ రెడ్డి, రాష్ట్ర సేవా దళ్ నాయకులు షరీఫ్, లింగాల భాషా గౌడ్, రానా, కృష్ణారెడ్డి, జహంగీర్ బాబా గౌడ్, సములేటి సాయి, రమణ, రాజేందర్ రెడ్డి, పిట్టల రవి, వాహీద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ నగర్ చౌరస్తాలో..

భారత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆర్కే పురం డివిజన్ ఎన్టీఆర్ నగర్ చౌరస్తా లో రాజీవ్ గాంధీ విగ్రహనికి జిల్లా మైనారిటీ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఎస్.కె. మొహమ్మద్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇస్మాయిల్, రఫీక్, రజాక్, అలీ, జాంగిర్, బాబు మియా పాల్గొన్నారు.

రామంతాపూర్‌లో

రామంతాపూర్, మే 21 ప్రభాతవార్త : మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ వర్ధంతి వేడుకలు బుధవారం రామంతాపూర్‌లో ఘనంగా నిర్వహించారు. ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముళ్ల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఎం.డి.రఫీక్, వర్కింగ్ ప్రసిడెంట్ వల్లపు శ్రీకాంత్ యాదవ్, పిసిసి ప్రతినిధి ఎం.డి.తౌఫిక్, సీనియర్ నేతలు బి.సుధాకర్‌రెడ్డి, బజారు జగన్‌గౌడ్, అకారపు అరుణ్, సి.రఘుపతిరెడ్డి, లుకాస్, కంది శ్రవణ్‌రెడ్డి, లింగంపల్లి రామకృష్ణ, కొంపల్లి బాలరాజు, ఉపేందర్‌రెడ్డి, సత్తిరెడ్డి, నామ్ రాజిరెడ్డి, అమరేశ్వర్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ దేశంలో పలు సంస్కరణలు అమలు చేసిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ విగ్రహానికి పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు సల్ల ప్రభాకర్‌రెడ్డి, రాజు, అలీం, అస్లామ్‌బాయ్, రఘు, హనుమంతు, శేఖర్‌రెడ్డి, మదన్‌గౌడ్, రాంరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శేఖర్, భాస్కర్, ప్రశాంత్‌రెడ్డి, బచ్చరామ్, లక్ష్మణ్, బంటి సతీష్, జిత్తురెడ్డి, శివ, నరేష్ పాల్గొన్నారు.

డిసిసి కార్యాలయంలో..

సరూర్‌నగర్, మే 21 ప్రభాతవార్త: మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జిల్లెలగూడ మంద మల్లమ్మ చౌరస్తా సమీపంలోనున్న రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం భారత రత్న, మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ టియుఎఫ్ఐడిసి ఛైర్మన్, రంగారెడ్డి డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి పార్టీ నాయకులతో కలిసి రాజీవ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ మాజీ ఫ్లోర్ లీడర్ చల్లా కవితా బాల్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు సిద్దాల మౌనిక శ్రీశైలం, గజ్జెల రాంచందర్, మాజీ ఎంపిటిసి నిమ్మల వెంకటేశ్ గౌడ్, నాయకులు పరశురాం, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, మాదరి శ్రీనివాస్, సిద్దేశ్వరచారి, ఐతరాజు భాస్కర్ పాల్గొన్నారు.

మార్కెట్ అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర ఎనలేనిది : ఆర్జెడి మల్లేశం

మలక్ పేట , మే 21, ప్రభాతవార్త: హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ల అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర ఎనలేనిదని, ముఖ్యంగా ఎస్ జిఎస్ దామోదర్ కృషి మరువలేనిదని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ హైదరాబాద్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ మల్లేశం పేర్కొన్నారు. మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రీజినల్ జాయింట్ డైరెక్టర్ మల్లేశం, డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద్ రావు, గ్రేడ్1 కార్యదర్శి చిలుక నరసింహారెడ్డి, ఉద్యోగుల రాష్ట్ర కార్యదర్శి ముకరం, తెలంగాణ చాంబర్ ఆఫ్ అగ్రి ట్రేడర్స్ అధ్యక్షుడు చేగురి వెంకట రమణ, ప్రధాన కార్యదర్శి బట్కిరి వివేకానంద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు దుగ్గ జగదీష్, మాదారం కృష్ణ, వ్యాపారస్తులు తదితరులు ఎస్ జి ఎస్ దామోదర్ కు పుష్పగుచ్చాను అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆర్జెడి మల్లేశం, డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద్ రావు లు మాట్లాడుతూ నగరంలో హైదరాబాద్ మార్కెట్ అభివృద్ధి పథంలో ఉందని తెలిపారు. ఎస్ జి ఎస్ దామోదర్ మాట్లాడుతూ రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారికి మెరుగైన గిట్టుబాటు ధరను అందించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. మార్కెట్లను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆధునికరిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాపారస్తులు చిగుమల్ల శంకర్, శ్రీనివాస్ రెడ్డి, వెంకటేష్, అనిల్, కృష్ణ, వెంకటరెడ్డి, శంకర్ మహతో, అయ్యవారి పాండు, వెంకటరమణ, అధికారులు పుష్ప, మాధురి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ జి ఎస్ దామోదర్ ను సన్మానిస్తున్న ఆర్జెడి మల్లేశం, డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద్ రావు, గ్రేడ్1 కార్యదర్శి చిలుక నరసింహారెడ్డి, ముకరం తదితరులు

రామంతాపూర్‌లో జోనల్ కమిషనర్ హేమంత్ పర్యటన

రామంతాపూర్, మే 21 ప్రభాతవార్త : రామంతాపూర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి, పలువురు అధికారులు,కాలనీ నేతలతో కలిసి పర్యటించారు. రామంతాపూర్ వివేక్‌నగర్, శాంతినగర్, ఇందిరానగర్‌లలో రూ.1.40 కోట్ల వ్యయంతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన చేపట్టాలని అధికారులకు సూచించారు. ఇందిరానగర్‌లో ఉన్న పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులు చేపట్టాలని, డ్రైనేజీ పనులు పూర్తి చేయాలని సూచించారు. పనుల విషయంలో నాణ్యత పాటించాలని, ప్రజలకు ఇబ్బంది లేకుండా పనులు పూర్తి చేయాలని సూచించారు. కార్పొరేటర్ బండారు శ్రీవాణి మాట్లాడుతూ డివిజన్‌లో ప్రజలకు మౌళిక సదుపాయాల కల్పనకు తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పనులు వెంటనే చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో పర్యటించి సమస్యలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిసి అంజనేయులు, ఇంజనీర్ హరిలాల్, డిఇ నాగమణి, ఎఇ శ్వేతశ్రీ, డిఇ చందన, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేందర్, బిజెపి సీనియర్ నేతలు బండారు వెంకట్రావ్, రేవు నరసింహా, ఉలుగొండ నారాయణదాసు, అశోక్‌రాజా, మురళీధర్‌చారి, పడిగం నగేష్, జగదీష్ పాల్గొన్నారు.

రామంతాపూర్‌లో పర్యటిస్తున్న జోనల్ కమిషనర్ హేమంత్ పాటిల్, కార్పొరేటర్ శ్రీవాణి తదితరులు

మీర్‌పేట్ నందిహిల్స్ కాలనీలో వెలగని స్ట్రీట్‌లైట్లు

-ఇబ్బందుల్లో ప్రజలు - పట్టించుకునే వారు కరువు

సరూర్‌నగర్, మే 21 ప్రభాతవార్త:
మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని నందిహిల్స్ కాలనీలో రోడ్ నెంబర్ 15 ప్రధాన రోడ్డులో గత నాలుగు నెలల నుండి విద్యుత్ లైట్లు వెలడం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ కాలనీ రోడ్ నెంబర్ 15 నఉండి టీచర్స్ కాలనీ భారతీ స్కూల్ వరకు ప్రధాన రహదారిపై రాత్రుళ్లు వీధి దీపాలు వెలగని కారణంగా అంధకారం నెలకొని ఉంటున్నది. దీంతో ఈ ప్రాంతం గుండా వెళ్తున్న వాహనదారులతో పాటు ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అంధకారం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉండడంతో స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. లైటింగ్ వ్యవస్థ పని చేయని కారణంగా గాఢాంధకారం నెలకొని ఉండడంతో ఈ రహదారిపై నుండి ప్రయాణిస్తున్న వాహనాలు లైట్లు, స్థానిక షాపుల వారి లైట్లే రోడ్లపై వెలుగులకు దిక్కవుతున్నాయి. ఈ ప్రాంతంలో తెల్లవారు జామున కంటే ముందే సుమారు 4.30 గంటల నుండే వాకింగ్‌కు వెళ్లే వారితో జన సంచారం మొదలవుతుంది. ఇక రాత్రి పూట అయితే ఏకంగా అర్ధరాత్రి వరకు వాహనాల రాకపోకలతో రోడ్డు బిజిగా ఉంటుంది. లైట్లు వెలగని కారణంగా అందరికీ ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇక పోతే నందిహిల్స్ రోడ్ నెంబర్ 1 నుండి 24 వరకు ఉన్న వీధి దీపాల్లో చాలా వరకు పాడైనా రిపేర్ చేయకపోవడంతో ఇక్కడి రోడ్లల్లో కూడా సమస్యలు కలుగుతున్నాయి. వీధి దీపాల సమస్యలను పట్టించుకునే వారే లేరనీ కాలనీవాసులు వాపోతున్నారు. ప్రతి సంవత్సరం కంచన్‌గా పన్నులు కడుతున్నా తమ సమస్యలను మాత్రం తీర్చడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు స్పందించి నందిహిల్స్ ప్రధాన రోడ్డులో లైట్లు అదే విధంగా పాడైన లైట్లు సరి చేయాలని 9వ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ ఇంఛార్జి రామిడి నర్సిరెడ్డి కోరుతున్నారు.

నందిహిల్స్ ప్రధాన రోడ్డులో వెలగని విద్యుత్ లైట్లు

విశ్వేశ్వరాయ ఇంజనీర్స్ కాలనీలో సి.సి.కెమెరాలు ప్రారంభం

వనస్థలిపురం. మే.21.ప్రభాతవార్త.
విశ్వేశ్వరాయ ఇంజనీర్స్ కాలనీలో సిఎం రేవంత్ రెడ్డి మల్కాజ్గిరి ఎంపీగా ఉన్నప్పుడు మంజూరు చేసిన సీసీ కెమెరాల ప్రారంభోత్సవాన్ని మరియు కాలనీలో 580 మీటర్ల సిసి రోడ్ల పనుల ప్రారంభోత్సవాన్ని కాలనీ కార్యవర్గం కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ సుజాత నాయక్ ప్రారంభించారు. సీసీ కెమెరాలు సిసి రోడ్ల ప్రారంభోత్సవం సందర్భంగా విశ్వేశ్వరయ్య కాలనీ అభివృద్ధికి తన వంతు సహాయం ఎల్లప్పుడూ ఉంటుందని తన సహకారంతో ముమ్ముందు కాలనీలోని రోడ్లు డ్రైనేజీలను పూర్తిస్థాయిలో అతి త్వరలోనే పూర్తి చేయడానికి సహకరిస్తానని విశ్వేశ్వరాయ కాలనీ తో పాటు హస్తినాపురంలోని అన్ని కాలనీలా అభివృద్ధికి మరికొన్ని నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తానని హస్తినాపురం డివిజన్ అభివృద్ధి కోసమే పార్టీ మారానని అది నేడు మనకు నిధులు రూపంలో హస్తినాపురం డివిజన్ అభివృద్ధి జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శశిధర్ రెడ్డి గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి బ్రహ్మరెడ్డి సతీష్ గౌడ్ స్టార్ నరసింహ జనార్ధన్ యాదయ్య కాలనీ అధ్యక్షులు దోర్నాల విజయభాస్కర్ రెడ్డి ప్రధాన కార్యదర్శి గోల్సం అమర్ నాథ్ యాదవ్ మంద ప్రవీణ్ రాహుల్ సాగర్ విష్ణువర్ధన్ బద్రి కృష్ణ మంద శ్రీనివాస్ రెడ్డి శ్రీపతి శ్రీనివాస్ రెడ్డి మంకాల శేఖర్ రెడ్డి ఐలేష్ గౌడ్ అల్వాల్ గౌడ్ రమేష్ శ్రీనివాస్ రెడ్డి అల్వాల్ రెడ్డి కాస వెంకటేష్ ధర్మారెడ్డి బి స్ స్వామి ప్రమోద్ ప్రసాద్ రెడ్డి కాలనీవాసులు పాల్గొన్నారు

విశ్వేశ్వరాయ ఇంజనీర్స్ కాలనీలో సీసీ కెమెరాలు సిసి రోడ్ల ప్రారంభోత్సవంలో పాల్గొన్న జిహెచ్ఎంసి స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్ కార్పొరేటర్ సుజాత నాయక్

గో రక్షణ చట్టాలు కఠినంగా అమలు చేయాలి : బాలకృష్ణ గురుస్వామి

డిజిపి జితేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాలకృష్ణ గురుస్వామి

సైదాబాద్, మే 21 ప్రభాతవార్త: బక్రీద్ పండుగ సందర్భంగా గోవుల అక్రమ రవాణాను అరికట్టాలని కోరుతూ డిజిపి డాక్టర్ జితేందర్‌కు అఖిల భారత గోసేవ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బాలకృష్ణ గురుస్వామి వినతిపత్రం అందజేశారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని కొన్ని వేల గోవులు, ఎద్దులను రాష్ట్రంలోకి అక్రమంగా తరలిస్తున్నారని, గో రక్షణ చట్టాలను కఠినంగా అమలు చేయాలని ఆయన డిజిపిని కోరారు. ఆవులు, ఎద్దులు లేకపోతే భూతాపం పెరుగుతుందని, పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని 1977 నాటి గో చట్టాలను కఠినంగా అమలు చేయాలని డిజిపిని కోరారు. ఆర్టికల్ 48ఎ ప్రకారం గో హత్యలు నేరమని చెబుతున్నా చట్టాలు సరిగ్గా అమలు కావడం లేదని, అంతేగాకుండా గో రక్షకులపైనే అక్రమంగా కేసులు పెడుతున్నారని దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిజిపిని కోరారు. డిజిపిని కలిసిన వారిలో తెలంగాణ గుజరాతి సంఘం అధ్యక్షుడు జిగ్నేష్ దోషి, ఆసరా ఫౌండేషన్ అధ్యక్షుడు గౌరీ వందన, అఖిల భారత గోసేవ ఫౌండేషన్ సంయుక్త కార్యదర్శి రాఘవేందర్ ఉన్నారు.

నిర్మాణం పనులను పరిశీలించిన కార్పొరేటర్

పనులను పరిశీలిస్తున్న పవన్‌కుమార్

ఎల్‌బినగర్, మే 21 ప్రభాతవార్త: డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ పేర్కొన్నారు. ఎల్బీనగర్ నుంచి మూసి వరకు పైప్ లైన్ ఏర్పాటు చేస్తుండటంతో కార్పొరేటర్ పైప్ లైన్ పనులను బుధవారం పరిశీలించారు. సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పరిసర కాలనీ వాసులకు సమాచారం లేకుండా పనులు ఎలా ప్రారంభిస్తారని అధికారుల తీరు పట్ల అసహనం వ్యక్తం చేశారు. పైప్ లైన్ పనులను వెంటనే ఆపాలని, మూసికి సరైనటువంటి అవుట్ లేట్ లేదని, దానివల్ల వర్షాకాలంలో న్యూ నాగోల్ కాలనీ, సమతపురికాలనీ, భరత్‌నగర్‌లలో వరదనీటి సమస్య ఏర్పడుతుందన్నారు. పైప్ లైన్ అవుట్ లైట్ పూర్తిగా పరిశీలించిన తర్వాతే పనులు ప్రారంభించాలని,లేకపోతే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని అన్నారు.

18 సంవత్సరాల యువతకు ఓటు కల్పించిన రాజీవ్:చిలుక

రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఉపేందర్‌రెడ్డి

ఎల్‌బినగర్, మే 21 ప్రభాతవార్త: ఆర్కేపురం డివిజన్ వాసవికాలనీలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా రాజీవ్ గాంధీ కాంస్య విగ్రహాన్నికి పూలమాలలు వేసి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ భారత యువ ప్రధానిగా బాధ్యతలు నిర్వహించి యువత రాజకీయాల్లోకి వచ్చేలా స్ఫూర్తి నింపిన నేత రాజీవ్ గాంధీ అన్నారు. 18 సంవత్సరాల వారికి ఓటు హక్కు కల్పించడం, పంచాయతీరాజ్ వ్యవస్థ, నవోదయ విద్యాలయాలు లాంటి అనేక పథకాలు ఆయన హయంలో వచ్చాయని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో బండి మధుసూధన్ రావు, శేఖర్ ముదిరాజ్, శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ ఛైర్మెన్ తలాటి రమేష్ నేత, వెంకటేష్ గుప్తా, పెద్దవూర సైదులు, బొడ్డుపల్లి మహేందర్, లింగ స్వామి గౌడ్, యాదవ రెడ్డి, రాజు నాయక్, రేణుక, మామిడి రామకృష్ణ గౌడ్, ప్రేమ్ నాయక్, భాస్కర్, పగడాల ఎల్లన్న, దుర్గ ప్రసాద్, సాయి, శ్రీనివాస్, అల్లావుద్దీన్ పటేల్, సాయి కుమార్, వెంకటేశ్వర్లు, జహంగీర్, సంతోష్, వెంకట్ రెడ్డి, శశి యాదవ్, సంతోష్, యాదగిరి యాదవ్, సుధాకర్ చారి, నాను నాయక్, నగేష్, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

రూ.39లక్షలతో బ్యాంక్ కాలనీ కమ్యూనిటి హాల్ : బన్నాల గీత

బ్యాంక్ కాలనీ కమ్యూనిటిహాల్